
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 11.11.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 23 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# బ్లాక్‌కు షాక్

- నల్లధనంపై మోడీ సర్జికల్‌స్ట్రైక్
- దేశ చరిత్రలో పెనుసంచలనం
- నల్ల ధనవంతుల్లో కలవరం
- 'స్విస్' వీరుల ఆశలకు సమాధి
- ప్రజలకు తాత్కాలిక సమస్యలు
- అధిగమిస్తే అంతా శుభమే
- కాలరెగరేస్తున్న చిన్ననోట్లు
- వ్యాపార లావాదేవీల స్థంభన



సంచలనం... కాదు పెను సంచలనం! భారతదేశ ఆర్థిక వ్యవస్థను మలుపు తిప్పే అసామాన్య నిర్ణయం. ఎవరూ ఊహించలేదు, ఎవరూ ఆలోచించలేదు... ఒక్క నిర్ణయంతో... ఒకే ఒక్క రాత్రిలో రహస్య గదుల్లో, విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న లక్షల కోట్ల నల్లకరెన్సీ చిత్తు కాగితాలుగా మారుతాయని. వేలకోట్ల అధిపతులమనుకుంటున్న వాళ్లు ఒక్క రాత్రిలో వేలకోట్లు పోయి సాధారణ ఆస్థిపరులుగా మారుతారని... ఎవరూ ఊహించలేదు. (మిగతా 11వ పేజీలో)



## 'వైట్' ఫైట్‌లో... 12లో

# ట్రంప్ హిట్... హిల్లరీ ఔట్!

- అమెరికా 45వ అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్



## ప్రారంభోత్సవ శుభాకాంక్షలు



గౌ॥ శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు
కేంద్ర పట్టణాభివృద్ధి మరియు సమాచార ప్రసార శాఖ మంత్రివర్యులు



గౌ॥ డా॥ కామినేని శ్రీనివాస్ గారు
వైద్య ఆరోగ్య మరియు వైద్యవిద్యాశాఖ మంత్రి



గౌ॥శ్రీ గంటా శ్రీనివాస్ గారు
విద్యాశాఖ మరియు మానవవనరులశాఖ మంత్రి



గౌ॥ డా॥పి.నారాయణ గారు
మున్సిపల్‌శాఖ మరియు పట్టణాభివృద్ధిశాఖ మంత్రి



గౌ॥శ్రీ సిద్ధా రాఘవరావు గారు
రవాణా, వాణిజ్య మరియు రోడ్లు భవనాలశాఖ మంత్రి



గౌ॥శ్రీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి గారు
పార్లమెంట్ సభ్యులు, నెల్లూరు



గౌ॥శ్రీ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి గారు
జిల్లాపరిషత్ ఛైర్మన్



గౌ॥శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గారు MLC
మాజీ మంత్రివర్యులు



గౌ॥శ్రీ బీదా రవిచంద్ర గారు
శాసనమండలి సభ్యులు



గౌ॥శ్రీ వాకాటి నారాయణరెడ్డి గారు
శాసనమండలి సభ్యులు



గౌ॥శ్రీ మేకపాటి గౌతమ్‌రెడ్డి గారు
శాసన సభ్యులు, ఆత్మకూరు



గౌ॥శ్రీ ఆనం రామనారాయణరెడ్డి గారు
మాజీ మంత్రివర్యులు
TDP ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్



గౌ॥శ్రీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి గారు
మాజీ మంత్రివర్యులు
TDP నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్

Ravi Designs 8121355857



కీ॥శే॥శ్రీ కంచర్ల శేషయ్యనాయుడు
కీ॥శే॥శ్రీమతి కంచర్ల సరోజనమ్మ

A.S పేట మండలం చిరమన గ్రామానికి విద్యా, వైద్య సేవలను మరింత మెరుగుగా అందించుటకు
కీ॥శే॥శ్రీమతి కంచర్ల సరోజనమ్మ స్మారక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరియు
కీ॥శే॥శ్రీ కంచర్ల శేషయ్యనాయుడు స్మారక ప్రభుత్వ హైస్కూల్ నందు
తరగతి గదులు మరియు ల్యాబ్స్‌ను
కేంద్ర మంత్రివర్యులు గౌ॥శ్రీ యం.వెంకయ్యనాయుడు గారు మరియు
ఆంధ్రప్రదేశ్ మంత్రులు మరియు ప్రజాప్రతినిధుల సమక్షములో ప్రారంభిస్తున్న శుభతరుణంలో మెరుగైన
విద్యా, వైద్యసేవలు పరిసరగ్రామ ప్రజలకు చేరువవ్వాలని కోరుకొంటూ...

తేది: 13-11-2016 సమయం: ఉ॥10.00 గం॥లకు

శ్రీ కంచర్ల సుధాకర్‌నాయుడు
డా॥రవీంద్రనాథ్ కంచర్ల
CMD, గ్లోబల్ హాస్పిటల్ గ్రూప్
డా॥రమేష్ కంచర్ల
CMD, రైన్‌బో హాస్పిటల్ గ్రూప్
శ్రీ కంచర్ల రమాధర్‌నాయుడు

# దండగమారి యాత్రలు

- ప్రజల్లో స్పందన అంతంత మాత్రం
- కార్యకర్తల్లో నిస్తేజం
- పనులు తీసుకున్న వాళ్లు బలవంతంగా పాల్గొంటున్న వైనం




జనచైతన్య యాత్రల పేరుతో ప్రజల ముందుకు పోండి... రెండున్నరేళ్లలో మన ప్రభుత్వం సాధించిన ఘనవిజయాలను వారికి చెప్పండంటూ చంద్రబాబు తెలుగు దేశం శ్రేణులను ఆదేశించడం తెలిసిందే! అయితే జనచైతన్య యాత్రల పేరుతో ప్రజల ముందుకు వెళ్లి ఏం వెలగబెట్టామని చెప్పాలో తెలియక తెలుగుతమ్ముళ్లు బుర్రలు గోక్కుంటున్నారు. అదీగాక జనచైతన్య యాత్రలు హుషారుగా నిర్వహించా లన్నంత ఆసక్తి కూడా కార్యకర్తల్లో లేకుండా పోయింది. ఎవరి కోసం నిర్వహించాలి, ఎందుకోసం ఈ యాత్రలు నిర్వహించాలి, పార్టీ ప్రతిపక్షంలో వుంటే జెండాలు మోసేది మేము, బ్యానర్లు పెట్టేది మేము, కటౌట్‌లు కట్టేది మేము, రోడ్లెక్కి ఉద్యమాలు చేసింది మేము... పార్టీ అధికారంలోకి వచ్చాక మాత్రం పదవులు తన్నుకుపోయేది ఇతర పార్టీల నుండి వచ్చిన వాళ్లు... మాకెందుకొచ్చిన తలనొప్పిలే అనే భావం తెలుగుదేశం ఒరిజినల్ కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది.

ప్రతి నియోజకవర్గంలోనూ జనచైతన్య యాత్రలు మొక్కుబడిగానే జరుగుతున్నాయి. ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట పది మందిని పోగేసుకుని, తెలుగు దేశం జెండాలు కనిపించేలా తిరగడం, పని కాగానే జెండాలు మడతపెట్టుకుని పోవడం చేస్తున్నారు. ప్రభుత్వం వెలగ బెట్టిందేమీ లేకపోవడంతో ఈ యాత్రలలో ప్రజలకు ఏం చేసామో చెప్పేది లేక, కార్యకర్తలు, నాయకులు చాలావరకు బైక్ ర్యాలీలు చేస్తూ, ఎవరి గడప తొక్కకుండానే యాత్రలు ముగిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా తెలుగు కార్యకర్తలకు ఇటీవల కాంట్రాక్ట్ పనులు అప్పగించి వున్నారు. జనచైతన్యయాత్రల భారమంతా కూడా వాళ్లే మోస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ శ్రేణులు పూర్తి స్థాయిలో ఈ యాత్రల్లో పాల్గొనకపోవడం కార్యకర్తల్లో నెలకొన్న అసంతృప్తికి అద్దం పడుతోంది.

## సాఫ్ట్‌బాల్ పోటీలకు నవనీత స్కూలు విద్యార్థులు

అనంతపురంలోని ఆర్డీటి స్టేడియంలో ఈ నెల 5న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికలు జరిగాయి. ఈ పోటీల్లో నెల్లూరుజిల్లా కృష్ణపట్నం పోర్టు స్కూలు విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కోదండరామయ్య సోమవారం తెలిపారు. నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులో కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవనీత పబ్లిక్ స్కూల్‌కు చెందిన షణ్ముఖసుబ్రహ్మణ్యం, మానస, సుహితప్రియ అండర్-10 విభాగంలో, హరీష్, లిఖిత, పూజిత, సురేష్, శివ, యాసిబ్ అండర్-12 విభాగంలో ఎంపికయ్యారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీకి తొలిమెట్టు... నీరు-చెట్టు

ఎన్నికలు జరపకుండా అధికారపార్టీ నాయకులను ఎంపిక చేసుకుని వారికి నీరు-చెట్టు పనులను అప్పగించి వారి వద్ద ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పర్సంటేజీలను దండుకుంటున్నారని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శి పొదలకూరు సొసైటి మాజీఅధ్యక్షుడు గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం నెల్లూరులోని వైసిపి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా నీరు-చెట్టు పనులు వున్నాయని, దీంతో చెరువు కట్టల భద్రత అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో నీరు-చెట్టు పథకంలో అవినీతి జరుగుతున్న దృష్ట్యా విచారణ జరపాలని రైతులు విజిలెన్స్ అధికారులను కోరగా విచారణ జరుగుతోందని చెప్పారన్నారు. పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి కాకుటూరు లక్ష్మణరెడ్డి, ముత్తుకూరు మండల రైతు విభాగం అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మిస్‌ఫైర్... తప్పిన ప్రమాదం

క్రమశిక్షణతో విధులు నిర్వహించాల్సిన ఓ కానిస్టేబుల్ డ్యూటీ టైంలో మందుకొట్టొచ్చి, మత్తులో ప్రమాదకరంగా ప్రవర్తించిన సంఘటన ఇటీవల నెల్లూరులోని పెద్దాసుపత్రిలో చోటుచేసుకుంది. అనిల్ అనే ఏఆర్ కానిస్టేబుల్ పెద్దాసుపత్రిలోని ఖైదీల వార్డు దగ్గర విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఓ రోజు సాయంత్రం సమయంలో బయటకెళ్లిన అతను మందుకొట్టి మళ్లీ ఆసుపత్రికొచ్చాడు. మద్యం మత్తులో తన చేతిలో వున్న 303రైఫిల్‌ను అటు ఇటు తిప్పుతూ హల్‌చల్ చేస్తుండగా తుపాకీ పేలి బుల్లెట్లు ఆసుపత్రిలోని గోడకు తగిలాయి. కాబట్టి ప్రమాదం తప్పింది. అవే బుల్లెట్లు మనుషులకు తగులుంటే పరిస్థితి ఏంటి? కాల్పుల శబ్దం రాగానే ఆసుపత్రి సిబ్బంది, రోగులు భయంతో పరుగులు తీసారు. సిబ్బంది అనిల్ వద్ద వున్న తుపాకీని లాక్కుని పోలీసులకు సమాచారమిచ్చారు. ఏఆర్ ఆర్ఐ శ్రీనివాసరావు వెంటనే అక్కడకు చేరుకుని, కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకున్నారు.

సింహపురి సమాచారం

## పరిశుభ్రతతో వ్యాధులు దూరం

**- డిఎంఅండ్‌హెచ్ఓ వరసుందరం**

పరిసరాలను పరిశుభ్రంగా వుంచు కుంటే అనేకరకాల వ్యాధులు మనకు దూరంగా వుంటాయని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి వరసుందరం అన్నారు. సోమవారం నెల్లూరులోని డిఎంఅండ్ హెచ్ఓ కార్యాలయంలో జరిగిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని పరిసరాల్లో వున్న చెత్తాచెదారాన్నంతా శుభ్రం చేసి, మొక్కలు నాటారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ పరిశుభ్రతపై దృష్టి సారించాలని, మన చుట్టూ వున్న చెత్తాచెదారాన్నంతా ఎప్పటి కప్పుడు శుభ్రం చేసుకుంటూ వుంటే వ్యాధుల బాధలు వుండవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు, కార్యా లయ ఏ.ఓ సాయిరామ్, స్టాటిస్టికల్ అధికారి రఫీ, శుభావతి, సునీత, సతీష్, కిరణ్, శ్యామ్‌సన్, దిలీప్, మజరుల్లా తదితర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుబాంధవుడు ఆచార్య రంగా

ఆచార్య ఎన్‌జి రంగా రైతుబాంధవు డని, రైతులోకానికి ఆయన ఎనలేని సేవలు చేశారని పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు కొనియాడారు. నెల్లూరులోని ముత్తుకూరు రోడ్డులో వున్న ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనస్థానం, ఏరువాక కేంద్రం, నెల్లూరు కృషి విజ్ఞానకేంద్రంలో సోమ వారం ఆచార్య ఎన్‌జి రంగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు ఆచార్య ఎన్‌జి రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో శాస్త్రవేత్తలు అరుణ, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సూర్యనారాయణ, కెవికె ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఓబయ్య, డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ కృష్ణారెడ్డి, పుల్లంరాజుతో పాటు పలు రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'దేశం'తోనే రాష్ట్ర అభివృద్ధి

**ఎమ్మెల్సీ సోమిరెడ్డి**

రాష్ట్రంలో ప్రతిపక్షంలో వున్న వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ (వైకాపా) ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ఏమాత్రం పట్టించుకోకుండా కేవలం విమర్శలు చేయడమే పనిగా పెట్టుకుందని, ప్రభుత్వంపై లేనిపోని అసత్య ప్రచారాలు చేయడమే ధ్యేయంగా వైకాపా పనిచేస్తోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాలోని సీతారామపురంలో మాజీ జడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరుతున్న సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని, అయితే ప్రతిపక్షంలో వున్న వైకాపా మాత్రం ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకుందని ఆయన అన్నారు. జిల్లాలో 1030 కోట్ల మేరకు రుణమాఫీ జరిగిందని, అందులో రెండు విడతల్లో 500కోట్లకు పైగానే రైతులకు పంపిణీ చేశారని, మిగిలిన సొమ్మును కూడా మూడు వాయిదాల్లో 10 శాతం వడ్డీతో చెల్లించనున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఇలా రుణమాఫీ ద్వారా లబ్ధి పొందిన రైతుల్లో సుమారు 30 శాతం మంది వైకాపా నాయకులు, కార్యకర్తలే వున్నారని, వారికి సుమారు 300 కోట్లదాకా రుణమాఫీ జరిగిందని ఆయన వివరించారు. ప్రభుత్వాన్ని విమర్శించేవారు ఆ నగదును తిరిగి ఇచ్చేసి విమర్శించవచ్చని, అలాకాక ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందుతూనే ఈ విమర్శలేమిటని ఆయన ఎద్దేవా చేశారు. జిల్లాలో ఎలాంటి అభివృద్ధి లేదంటూ పనీపాటా లేకుండా గడపగడపా తిరిగే వైకాపా నాయకులకు జిల్లాలో జరుగుతున్న సంగం బ్యారేజీ పనులు, నెల్లూరు బ్యారేజీ పనులు, సోమశిల హైలెవల్ కెనాల్ పనులు, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్, తెలుగు గంగ పనులు, కండలేరు లిఫ్ట్ పనులు, బడ్జెట్ కేటాయింపులతో అవసరం లేకుండా నిర్వహిస్తున్న అనేక పనులు కనిపించడం లేదా అని సోమిరెడ్డి ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఇవికాక, మరో 300కోట్ల వ్యయంతో జిల్లాలో నీరు-చెట్టు పనులు జరుగుతున్నాయన్నారు. ఈ అభివృద్ధినేమీ పట్టించుకోకుండా కేవలం విమర్శలే లక్ష్యంగా వైకాపా పనిచేస్తుండడంలో అర్థం లేదన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఇలాంటి అసత్యప్రచారాలను ఖండించాలన్నారు. టిడిపి సభ్యత్వ నమోదు వల్ల కార్యకర్తలకు 2 లక్షల బీమాతో పాటు, చంద్రన్న బీమా పథకం కింద మరో 5 లక్షల బీమా వర్తిస్తుందని ఆయన తెలిపారు. ఈ సభలో ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఎరిక్సన్‌బాబు, మండల టిడిపి అధ్యక్షుడు చెన్నకేశవులు, జడ్పీటిసి సభ్యుడు జ్యోతి, నాయకులు చిరంజీవిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఇస్రాయిల్, ప్రభాకర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు

**- రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ హిదాయత్**



ముస్లిం, క్రిస్టియన్ తదితర మైనార్టీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ మహమ్మద్ హిదాయత్ అన్నారు. ఆదివారం నెల్లూరు పరమేశ్వరి నగర్‌లో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో మైనార్టీ వర్గాల నిరుద్యోగులు పాల్గొని ఉద్యోగాలు పొందవచ్చన్నారు. వ్యయప్రయాసలకు గురికాకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మైనార్టీ యువతకు వారివారి ప్రదేశాలలోనే ఉద్యోగావకాశాలు కల్పిస్తుందన్నారు. గత ప్రభుత్వాలు మైనార్టీల సంక్షేమానికి 300కోట్లు కేటాయించగా, ప్రస్తుత ప్రభుత్వం 710కోట్ల రూపాయలు ఈ ఏడాది కేటాయించింద న్నారు. జిల్లా జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ జాబ్‌మేళాలో 18కంపెనీలు పాల్గొన్నాయని, అర్హులైన అభ్యర్థులందరూ ఉద్యోగాలు పొందగలరన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏసిడిఎండి పి.ఉషాకుమారి, కార్పొరేషన్ డైరెక్టర్లు లాల్‌వాజీర్, కె.సప్తర్‌హుస్సేన్, పాల్ తదితరులు పాల్గొన్నారు.

## బినామీలకే చెక్‌డ్యాంలు

**మాజీఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి**

ఉదయగిరి నియోజకవర్గంలో నిర్మించనున్న రూ. 82కోట్ల ఫైబర్ చెక్‌డ్యాంల టెండర్ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు బినామి కాంట్రాక్టర్‌కు కట్టబెట్టారని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం వింజమూరులో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఫైబర్ చెక్‌డ్యాంల నిర్మాణం టెండర్ నిబంధనలు తనకు అనుకూలంగా తయారు చేసుకుని, ఆంధ్రప్రదేశ్‌లో ఏ కాంట్రాక్టర్‌కు దక్కకుండా మహారాష్ట్రలోని తన బినామీకి దక్కేలా ఎమ్మెల్యే బొల్లినేని వ్యవహరించారన్నారు. చెక్‌డ్యాంల నిర్మాణ అంచనాలను నాలుగురెట్లు పెంచి 70శాతం నిధులు దోచుకుతినడానికి సిద్ధమయ్యారని మండిపడ్డారు. దీనిపై ప్రభుత్వం విచారణ జరిపి దోపిడీని అరికట్టాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు మల్లు సుధాకర్‌రెడ్డి, బాలగురవారెడ్డి, నాగభూషణం, మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, హజరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నీళ్లపై మాటలు...
# నేతల నోట మంటలు

- 30టిఎంసీలతో 3లక్షల ఎకరాలు



జిల్లా సాగునీటి సలహా కమిటీ సమావేశం ఎట్టకేలకు ఈనెల 8వ తేదీన జరిగింది. ఇరు పక్షాల నాయకులు వాగ్వాదాల మధ్య నీళ్ల సమావేశంలో నిప్పులురేగాయి. ముఖ్యంగా నాన్‌డెల్టా రైతుల నోట్లో మట్టికొట్టేలా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైకాపా సభ్యుల్లోనూ అసంతృప్తిని కలిగించాయి. మెట్ట ప్రాంతానికి నీళ్ల విషయంలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అధికార పక్షాన్ని గట్టిగానే నిలదీసి గొడవ కూడా పెట్టుకున్నాడు. జిల్లాలో 5లక్షల ఎకరాలకు సాగునీళ్లివ్వచ్చని ఇరిగేషన్ అధికారులు నివేదికలు తయారు చేశారు. అయితే సమావేశంలో మాత్రం 3లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లివ్వాలని నిర్ణయించడం రచ్చకు దారితీసింది. నాన్ డెల్టాకు చెందిన అధికారపార్టీ సభ్యులు కూడా ఇరిగేషన్ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నీటి కేటాయింపుల్లో డెల్టాకు పెద్ద పీట వేసి నాన్‌డెల్టాను చిన్నచూపు చూశారు. గత ఏడాది ఇదే సీజన్‌లో 10లక్షల ఎకరాలకు సాగునీరందించగా, ఈ ఏడాది 3లక్షల ఎకరాలకే పరిమితం చేశారు. ఈ ఏడాది జిల్లాలో వర్షాలు లేకపోవడంతో పాటు సోమశిలకు శ్రీశైలం రిజర్వాయర్ నుండి వదలాల్సిన నీటిని పూర్తి స్థాయిలో వదల్లేదు. దీనికితోడు జిల్లాలో తాగునీటి అవసరాలు ఎక్కువగా వున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది సాగునీళ్లు అందించే విస్తీర్ణం బాగా పడిపోయింది.

## బ్యాంకులు కిటకిట...
# నోట్లకు కటకట

కేంద్రప్రభుత్వం 500, 1000 రూపాయల నోట్లను రద్దు చేయడంతో ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. మొన్నటి దాకా బ్యాంకుల్లో 100, 50నోట్లు ఇస్తామంటే ఖాతాదారులు... అబ్బే పెద్ద నోట్లుంటే ఇవ్వమనే వాళ్లు. ఇప్పుడు చిన్న నోట్ల కోసం అడుక్కోవాల్సి వస్తోంది. బయట మార్కెట్‌లో 500, 1000రూపాయల నోట్లు తీసుకోవడం లేదు. టిఫిన్ తినాలన్నా, టీ తాగాలన్నా, కూరగాయలు కొనాలన్నా... అందరూ వంద రూపాయల లోపు నోట్లే అడుగుతున్నారు.

10వ తేదీ బ్యాంకుల్లో పాత నోట్ల డిపాజిట్లు, కొత్త నోట్ల చెల్లింపులు మొదలు కావడంతో నెల్లూరుజిల్లాలోని అన్ని బ్యాంకులు ఖాతాదారులతో కిటకిటలాడుతున్నాయి. ఖాతాదారులు తమ ఆధార్‌కార్డులతో వచ్చి బ్యాంకుల వద్ద నోట్లు మార్చుకుంటున్నారు. ఈ నోట్లు చేతికొస్తేనే వారికి చిల్లర ఖర్చులకైనా డబ్బులు. బ్యాంకులకు పూర్తిస్థాయిలో కొత్త నోట్లు రాకపోవడంతో ఖాతాదారులకు పరిమిత స్థాయిలో మాత్రమే నగదు చెల్లింపులు జరుగుతున్నాయి. బ్యాంకుల వద్ద ఖాతాదారులు రామదండిగా వుండడంతో పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



# సైకత శివలింగానికి విశేషపూజలు



నెల్లూరు పెన్నానది పొర్లుకట్ట సమీపంలో పినాకిని స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోటి సోమవారం సందర్భంగా ఈ నెల 7వ తేదీ సైకత శివలింగాన్ని ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. మునీంద్ర, గోపాలకృష్ణ, శేషుబాబు స్వాముల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్ రెడ్డి, స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య, కార్పొరేటర్ రూప్‌కుమార్‌యాదవ్, రవీందర్‌రెడ్డి, రవి, శ్రీధర్, కృష్ణారెడ్డి, సత్యం పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# నెల్లూరులో 'నవ్యాంధ్ర పుస్తకాల సంబరాలు'

- అందుబాటులోకి వచ్చిన లక్షలాది పుస్తకాలు
- జిల్లావ్యాప్తంగా తరలివస్తున్న పుస్తకాభిమానులు



రాష్ట్ర విభజన తరువాత 'నవ్యాంధ్ర పుస్తక సంబరాలు' పేరిట తొలిసారిగా లక్షలాది పుస్తకాలు సింహపురిసీమ పాఠకులకు అందుబాటులోకి వచ్చేశాయి. ఈ పుస్తక ప్రదర్శనశాలలో ఎన్నో రకాల పుస్తకాలు ఇక్కడ కొలువుదీరడంతో సాహిత్యాభిలాషులు, పుస్తకపఠనాభిలాషుల సంబరం అంతా ఇంతా కాదు. ఎన్టీఆర్ ట్రస్ట్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, సాంస్కృతిక వ్యవహారాలశాఖల సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని వీఆర్‌సి మైదానంలో భారీఎత్తున జరుగుతున్న పుస్తక ప్రదర్శనశాలకు వచ్చి పుస్తకాలు కొనుగోలు చేసేందుకు పోటీలు పడుతున్నారు. 9 రోజుల పాటు జరిగే ఈ పుస్తక సంబరాలు ఈ నెల 5న పుస్తకప్రియుల సంతోష సంరంభాల మధ్య రాష్ట్ర మంత్రివర్యులు పి.నారాయణ ప్రారంభించారు. అందరినీ బాగా ఆకట్టుకునేవిధంగా వున్న ఈ పుస్తకప్రదర్శన 9 రోజుల పాటు జరుగుతుంది. ఇక్కడ ఏర్పాటుచేసిన 90 దుకాణాల్లో లక్షలాది పుస్తకాలున్నాయి. వాటిలో ఎంతో విలువైనవి, సాహితీపరంగా అమూల్యమైనవి ఎన్నో వున్నాయి. చిన్నపిల్లల నుంచి వయోవృద్ధుల దాకా అన్ని వయసుల వారినీ ఆకట్టుకునే పుస్తకాలెన్నో వున్నాయి. ప్రాచీనసాహిత్యం, ప్రబంధసాహిత్యం నుంచి నేటి ఆధునిక సాహిత్యం దాకా లెక్కలేనన్ని పుస్తకాలు ఇక్కడున్నాయి. ఉపనిషత్తులు, జీవితచరిత్రలు, వ్యక్తిత్వ వికాసం, తత్వశాస్త్రాలు, వైద్యగ్రంథాలు, కథల పుస్తకాలు, చిన్నారులను అలరించే ఎన్నో రకాల పుస్తకాలు ఇక్కడ కొల్లలు. ఈ పుస్తక విక్రయకేంద్రాల్లో కొనుగోలు చేసే ప్రతి పుస్తకానికి ధరలో 10 శాతం తగ్గింపు కూడా వుంటుండడంతో పుస్తకాభిమానులు ఎంతో ఉత్సాహంగా మరిన్ని పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇక్కడ ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల దాకా 1వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు వివిధ విభాగాల్లో క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, సంగీతం, స్పెల్‌బి పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో విజేతలకు పుస్తక ప్రదర్శన ముగిసే చివరి రోజైన 13వ తేది సాయంత్రం జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నారు. కాగా, నెల్లూరులో ఈ పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోంది. నెల్లూరు నగరం నుంచే కాక జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో విద్యార్థులు, యువకులు, తల్లిదండ్రులు, సాహిత్యాభిమానులు విచ్చేసి పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. కావాల్సిన పుస్తకాలను కొనుగోలు చేసేందుకు ఇది మంచి అవకాశమని, పుస్తకప్రియులకు నిజంగా ఇదో అద్భుతమైన వరమని అందరూ భావిస్తున్నారు.

# పుస్తకం బతికే వుంది

### - నవ్యాంధ్ర పుస్తక సంబరాల్లో తుంగా శివప్రభాత్‌రెడ్డి



నేటి నెట్‌కాలంలోనూ పుస్తకానికి ఏమాత్రం ఆదరణ తగ్గలేదని, పుస్తకం చెదలుపట్టకుండా బతికే వుందని, పుస్తకాలు విజ్ఞానాన్ని పంచే నేస్తాలని 'లాయర్' వారపత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని వీఆర్‌సి మైదానంలో జరుగుతున్న నవ్యాంధ్ర పుస్తక సంబరాల్లో బుధవారం రాత్రి జరిగిన సాహిత్యకార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిక్కన మహాకవి జన్మించిన ఈ సింహపురి గడ్డపై ఎందరో సారస్వతవేత్తలు జన్మించారని, ఎంతోమంది మహనీయులు సింహపురి సీమ ఖ్యాతిని దీప్తివంతం చేశారని అన్నారు. మహాకవి తిక్కన, కళాప్రపూర్ణ వేదం వేంకటరాయశాస్త్రి, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి, మనసుకవి ఆచార్య ఆత్రేయ, సహజకవి మల్లెమాల సుందరరామిరెడ్డి, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, పఠాభి వంటి సాహితీవేత్తలను ఈ సందర్భంగా మనం స్మరించుకోవడం ఒక అదృష్టమని అన్నారు. నవంబర్ 8వ తేదీ 'లాయర్' వ్యవస్థాపకుడు, తన తండ్రిగారైన తుంగా రాజగోపాల్‌రెడ్డి జయంతి అని, నవ్యాంధ్ర పుస్తక సంబరాలు ప్రతి ఏడాది నవంబర్‌లో నిర్వహించాలని భావిస్తున్నారు కనుక, నవంబర్ 8న జరిగే కార్యక్రమాలను నిర్వాహకులు తమకు కేటాయిస్తే తన తండ్రి స్మృత్యంకంగా తన తరఫున, 'లాయర్' పత్రిక తరఫున మరింత వేడుకగా ఆ కార్యక్రమాలను నిర్వహించేందుకు తమ పూర్తి సహకారం అందిస్తామన్నారు.

అనంతరం, వేదం వేంకటరాయ శాస్త్రి రచనల వైశిష్ట్యాన్ని విశ్రాంత అధ్యాపకులు చీమకుర్తి వెంకటేశ్వరరావు వివరించారు. ఎన్నో అత్యద్భుతమైన కావ్యాలు, నాటక రచనలతో వేదం వేంకటరాయశాస్త్రి సాహితీరంగంలో ప్రసిద్ధిచెంది సింహపురి ఖ్యాతిని దశదిశలా చాటారని కొనియాడారు. 'లాయర్' పత్రిక ద్వారా సాహిత్యరంగానికి విశిష్ట సేవలందిస్తున్న తుంగా శివప్రభాత్‌రెడ్డి అభినందనీయుడని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, ఎన్టీఆర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ ప్రధాన కార్యదర్శి సాయిరాం ఈ సందర్భంగా వివేకానందుని పుస్తకాన్ని తుంగా శివప్రభాత్‌రెడ్డికి జ్ఞాపికగా బహూకరించారు.

కవులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, అనేక మంది పుస్తకప్రియులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

**8 నవంబరు 2016**

దేశ చరిత్రలో.. ఇదో శుభప్రదమైన రోజు.

అదే రోజు అర్ధరాత్రి..

నల్లధన రక్కసిపై భారత ప్రధాని మోడీ వీరఖడ్గమెత్తిన రోజు..

దేశ ఆర్థిక వ్యవస్థను మలుపు తిప్పిన రోజు..

నల్లడబ్బుకు తెరపడిన రోజు..

అవినీతికి ఆస్కారం కలిగిస్తున్న పెద్దనోట్లు రద్దయిన రోజు..

దటీజ్ మోడీ!... అని ప్రధాని దేశప్రజల ప్రశంసలందుకున్న రోజు..

# శెభాష్.. మోడీ!



నల్లధనం, నకిలీ కరెన్సీ, అవినీతి జాడ్యాలను ఏకకాలంలో కూకటివేళ్లతో సహా పెకలించివేస్తూ ప్రధాని మోడీ తీసుకున్న 'పెద్దనోట్ల రద్దు' నిర్ణయం ఎంతైనా సాహసోపేతం. నల్లధనాన్ని నిరోధిస్తామని ప్రధాని పదేపదే చెప్తున్న మాటలు ఇప్పుడు నేరుగా ఆచరణలోకి రావడం ప్రధాని నిబద్ధతకు..దీక్షాదక్షతలకు నిదర్శనం..నల్లడబ్బును దేశంలోంచి ఊడ్చిపారేసేందుకు ప్రధాని మోడీ తీసుకున్న ఈ నిర్ణయం అందరూ ఆహ్వానించదగ్గ మంచి పరిణామం. ఇది దేశప్రజలకు.. ప్రగతికి శుభకరం.. శ్రేయస్కరం!..

దేశాన్ని ఇంతకాలం పట్టి పీడిస్తున్న నల్లడబ్బుకు మంగళం పలకడానికి మంగళవారం సుముహూర్తం ఖరారైంది. అవినీతికి ఆలవాలంగా నిలుస్తున్న నల్లడబ్బు కోరలు పెరికి.. దానికి శాశ్వతంగా పాతర వేయడానికి, తద్వారా దేశాభ్యున్నతికి, స్వచ్ఛమైన పాలనకు మార్గం వేయడానికి శుభముహూర్తం నిర్ణయమైంది. పెద్దనోట్లను రద్దుచేస్తూ ప్రధాని మోడీ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయం సంచలనాత్మకమైంది. దేశంలో నల్లధనాన్ని ఊడ్చిపారేస్తూ ప్రధాని మోడీ తీసుకున్న ఈ అద్భుతమైన నిర్ణయం పట్ల దేశవ్యాప్తంగా ప్రజలనుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దేశ అభివృద్ధి కోసం తీసుకున్న ఈ చరిత్రాత్మక నిర్ణయం పట్ల ప్రజలు సంతోషం ప్రకటిస్తున్నారు. 'నల్లడబ్బు'ను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా 500, 1000 రూపాయల నోట్లను రద్దు చేయడంతో నల్లధన రాశులకు, అవినీతి రాకాసులకు శాశ్వత ప్రాతిపదికన ఇక అడ్డుకట్ట పడినట్లే. నానాటికీ పేదలకు కష్టాలు పెరిగేందుకు, అవినీతి జాడ్యం ఆకాశాన్నంటేందుకు మూలకారణమవుతున్న ఈ నల్లధనానికి ప్రధాని మోడీ అంటకత్తెర వేశారు. నల్లధనం, నకిలీ కరెన్సీ, ఉగ్రవాదం అనేవి దేశ అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతున్నాయని, వాటిని నిరోధించడం ద్వారానే దేశ ప్రగతి రథం సాఫీగా ముందుకు సాగుతుందని గుర్తించి తదనుగుణంగా ప్రధాని చర్యలు తీసుకోవడం ఎంతైనా హర్షదాయకమే.

ఉగ్రవాదం, నల్లధనం, అవినీతిని కూకటి వేళ్లతో సహా పెకలించాలని, ఈ జాడ్యాలు దేశానికి మానని పుండులా మారి జాతిని తొలిచేస్తున్నాయని ప్రధాని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ జాడ్యాలపై పకడ్బందీగా యుద్ధం చేయాల్సి వుందని''..ఆ దుర్నీతులపై నేరుగా సమరభేరీ మోగించారు. చట్టవ్యతిరేక ఆర్థిక కార్యకలాపాలు దేశానికి అతిపెద్ద ముప్పుగా పరిణమిస్తున్నాయని.. ఇక అవి లేవకుండా గట్టి వేటు వేశారు. ప్రత్యేకించి "అమాయకులను బలితీసుకునే ఉగ్రవాదులకు డబ్బు ఎక్కడినుంచి వస్తుందో తెలుసా?.. నకిలీ కరెన్సీని సరిహద్దులు దాటించి భారత్‌లో ఉగ్రవాదానికి ఊతమిస్తున్నారు. ఈ పెద్దనోట్ల రద్దుతో దేశవిద్రోహులు, సంఘవ్యతిరేకుల వద్ద వున్న వెయ్యి, అయిదువందల నోట్లు ఇక చిత్తుకాగితాలతో సమానమే. నల్లదొరలు పరుపుల కింద దాచిన నల్లధనం ఇక నశించాల్సిందే'..అంటూ ప్రధాని మోడీ చేసిన ప్రకటన దేశప్రజలను హర్ష పులకాంకితుల్ని చేసింది. తాము తీసుకున్న చర్యలతో ఇప్పటికే 1.25 లక్షల కోట్ల నల్లధనం బయటికి వచ్చిందని, దీపావళి మరుసటిరోజు చెత్తాచెదారాన్ని ఊడ్చేసినట్లే నల్లధనాన్ని కూడా దేశం నుంచి ఊడ్చేసేయాలని ప్రధాని ప్రజలకు పిలుపునివ్వడం జాతికి ఆనందం కలిగించింది. ఈ నేపథ్యంలో " కొన్ని స్వల్ప ఇబ్బందులు ఎదురైనా, దేశ చరిత్రలో జాతి నిర్మాణానికి సంబంధించిన ఇలాంటి సందర్భాలు ప్రతిఒక్కరి జీవితంలో కొన్నే వస్తాయి.. అందులో పాలుపంచుకునే క్రమంలో చిన్న చిన్న కష్టాలు పట్టించుకోకండి''.. అని ప్రధాని ప్రజలకు వినమ్రంగా విజ్ఞప్తి చేయడం ప్రధాని విజ్ఞతకు, ప్రజల పట్ల వున్న విధేయతకు నిదర్శనం. ఈ నిర్ణయంతో సామాన్య ప్రజల డబ్బుకు ఎలాంటి ఇబ్బందీ వుండదు. తమవద్ద వున్న పెద్దనోట్ల మార్పిడికి ప్రభుత్వం పేర్కొన్న మార్గదర్శకాలను అనుసరిస్తే చాలు. ఇప్పుడు 5వందల నోట్ల కంటే తక్కువ విలువున్న నోట్లు యధావిధిగా చెల్లుబాటు అవుతాయి కనుక, ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవడానికి ఎంతో వెసులుబాటు వుంటుంది. అందువల్ల తమ డబ్బు ఏమైపోతుందోనని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరమే లేదు. ఈ నిర్ణయం వల్ల ఖాతాలో లేని ధనం బయటికివస్తుంది కనుక బెంబేలెత్తిపోయేదంతా నల్లకుబేరులే.

మొత్తమ్మీద నల్లధనం, నకిలీ కరెన్సీ నుంచి దేశాన్ని విముక్తం చేసి మరింత స్వచ్ఛం చేయాలన్న లక్ష్యంతో ప్రధాని మోడీ తీసుకున్న ఈ సాహసోపేతమైన చర్యలు ప్రజలకెంతో ఆనందం కలిగిస్తున్నాయి. ఇక గురువారం (ఈ నెల 10వ తేది) నుంచి కొత్తగా 2వేలు, సరికొత్త డిజైన్‌తో ముద్రించిన 500 వందల నోట్లు చలామణిలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏదేమైనా, దేశ ఆర్థికవ్యవస్థ పురోగమించడానికి, దేశాభ్యున్నతి సక్రమంగా సాగడానికి..తద్వారా విశుద్ధ భారత్ నిర్మాణానికి..భారత ప్రధాని నరేంద్రమోడీ తీసుకున్న ఇంతటి బృహత్తరమైన నిర్ణయం ఎంతైనా చరిత్రాత్మకమే.

నల్లధనం నిరోధిస్తామని ప్రధాని ప్రజలకిచ్చిన మాటలను నెరవేరుస్తూ... ఆ మాటలు నేరుగా ఇప్పుడు ఆచరణలోకి రావడం..ఎంతో అనూహ్యంగా, పకడ్బందీగా ఈనెల 8వ తేది అర్ధరాత్రినుంచి అవి అమలులోకి రావడం ప్రధాని నిబద్ధతకు.. దీక్షాదక్షతలకు నిదర్శనం..ఇది అందరూ ఆహ్వానించదగ్గ మంచి పరిణామం. ఇది దేశానికి, దేశప్రజలకు.. దేశప్రగతికి ఎంతైనా శుభకరం..శ్రేయస్కరం!

# కమనీయం శ్రీవారి కళ్యాణోత్సవం



శ్రీవారి జన్మ నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు దర్గామిట్ట టిటిడి కళ్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కళ్యాణం కమనీయంగా జరిగింది. ప్రధానార్చకులు వేదగిరి ఫణిశర్మ నేతృత్వంలో అర్చక స్వాములు గోవిందనామ సంకల్పాన్ని నిర్వహించారు. గుండాల గురవయ్య ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. వైష్ణవీ భజన బృందం కోలాటం అలరించింది. శ్రీవారికి పుష్పయాగాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ, నగర కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఉభయకర్తలుగా సి.వి.సుబ్రహ్మణ్యం దంపతులు, శ్రీధర్‌రెడ్డి దంపతులు, భావనారాయణరెడ్డి దంపతులు, పల్లంపాటి రాము దంపతులు, చెరుకూరి ఆదినారాయణ దంపతులు వ్యవహరించారు. ధర్మప్రచార పరిషత్ కో–ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి, ధర్మప్రచార మండలి ఉపాధ్యక్షులు కొండా శేఖర్‌రెడ్డి, శ్రీ రంగనాథస్వామి దేవస్థానం ఛైర్మెన్ మంచికంటి సుధాకర్ రావు, దేవరాయపల్లి నాగార్జున, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీ మైనార్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కరిముల్లా

కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కరిముల్లాను నియమిస్తూ సోమవారం డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కరిముల్లా కృష్ణయ్యను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# నేత్రపర్వంగా పెన్నా హారతి



నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని జొన్నవాడ గ్రామంలో వున్న శ్రీమల్లికార్జున స్వామి సమేత కామాక్షమ్మ సన్నిధిలో కోటి సోమవారం సందర్భంగా పెన్నాహారతి నేత్రపర్వంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి, దేవాదాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత స్వామి, అమ్మవార్ల అనుగ్రహంతో పల్లకిలో హారతులను మంగళవాయిద్యాలతో పెన్నా నది వరకు తీసుకొచ్చారు. ఆలయ ప్రధానార్చకులు గంగాప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో పెన్నానదికి ఏకహారతి, నేత్ర హారతి, బిళ్వహారతి, భూతహారతి, పంచహారతులు, కుంభహారతి, నక్షత్ర హారతి, రథహారతులు ఇచ్చారు. కర్పూర నీరాజనం, ఛత్రమ, చామ్రములతో హారతులు ఇచ్చారు. గంగా, యమున, సరస్వతి, సింధు, కావేరి, గోదావరి, కృష్ణ నదులను పినాకినీ నదిలో ఆవానం చేసి పూజలు నిర్వహించారు. కోటి సోమవారం కావడంతో పెన్నాహారతికి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నదీమతల్లికి పూజలు చేసి అరటిబోదెల్లో దీపాలు వెలిగించి నదిలో వదిలారు. భక్తులకు ఉచితంగా టిటిడి లడ్డూలను ప్రసాదంగా పంపిణీ చేసింది.




## అప్పుడు లేవని నోర్లు.. ఇప్పుడు లేస్తున్నాయేం?

పాక్ ఆక్రమిత కాశ్మీర్ నుండి చొరపడుతున్న ఉగ్రవాదులు మన సైనికులను నిరాతకంగా చంపుతున్నారు. అమాయక ప్రజలను హత మారుస్తున్నారు. దేశం కోసం సైనికులు ప్రాణాలర్పిస్తున్నారు. పఠాన్‌కోట్‌లో, యూరి సెక్టార్‌లో ఉగ్రమూకలు దాదాపు 30మంది భారత సైనికులను మట్టుబెడితే ఇదేం అన్యాయమని ఖండించని నోర్లు మధ్యప్రదేశ్‌లో 8మంది సిమి ఉగ్రవాదులను ఎన్‌కౌంటర్ చేయగానే లేచాయి. బూటకపు ఎన్‌కౌంటర్‌లంటూ గొంతు చించుకుంటున్నాయి. ఈ దేశానికి ఉగ్రవాదులు కాదు, ఉగ్రవాదులను సమర్థించే వాళ్లు వారికన్నా ప్రమాదకారులు. కాబట్టి వీరిని కఠినంగా శిక్షించాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## మతి తప్పుతుందా?

ముఖ్యమంత్రి చంద్రబాబుకు తిక్క కాకపోతే సంస్కృతి సంప్రదాయాల నెలవైన ఆంధ్రప్రదేశ్‌లో బీచ్ ఫెస్టివల్స్, బికినీల పండుగలేంటి? ఆయన రాష్ట్రాన్ని అభివృద్ధిలో సింగపూర్ మాదిరిగా చేయడం లేదు. సంస్కృతిలో సింగపూర్, బ్యాంకాక్‌ల మాదిరిగా చేస్తున్నాడు. ఆ దేశాల్లో మాదిరిగా విచ్చలవిడి సంస్కృతిని ఇక్కడ ప్రవేశపెడుతున్నాడు. ఈరోజు ప్రపంచంలోని దేశదేశాల ప్రజలు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తుంటే, చంద్రబాబు విచ్చలవిడి సంస్కృతికి స్వాగతం పలుకుతుండడం బాధాకరం.

**సి.రాజీవి, నెల్లూరు.**

## కాంప్లెక్స్‌లు కట్టండి

నెల్లూరు నగరంలో ఎన్నో మున్సిపల్ స్థలాలు, రిజర్వ్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ ఆక్రమణల వెనుక కొందరు కార్పొరేటర్ల హస్తం కూడా వుంటుంది. ఈ రిజర్వ్ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా వుండాలంటే వాటిలో కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టి అద్దెకు ఇవ్వడమో, లేక అమ్మడమో చేయాలి. దీనివల్ల కార్పొరేషన్ ఆదాయం పెరుగుతుంది. ఆక్రమణలు తగ్గుతాయి. ఎలాగూ కార్పొరేషన్ వాళ్లు పార్కులు అభివృద్ధి చేసేదీ లేదు, పెట్టేదీ లేదు.

**– పచ్చిపాల కాత్యాయిని, నెల్లూరు.**

# పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం



## – విపిఆర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

**జిల్లాలో ఇప్పటికే ఆధ్యాత్మిక, విద్యా పరమైన సేవా కార్యక్రమాలలో పేదలకు చల్లని నీడనిచ్చే వృక్షంగా విరాజిల్లుతున్న విపిఆర్ ఫౌండేషన్ పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టింది. అర్హులైన పేదవారికి కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించడం ఏ విధంగా లక్ష్యంగా చేసుకున్నారో, ఆపదలో వున్న పేదవారికి కార్పొరేట్ వైద్యాన్ని కూడా ఉచితంగా అందించాలన్నదే ధ్యేయంగా తమ సేవలను విస్తరించాలని భావిస్తోంది విపిఆర్ ఫౌండేషన్.**

ఈ లక్ష్యంలో భాగంగానే ఈ నెల 6వ తేదీన విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరురూరల్ మండలం కనుపర్తిపాడు లోని విపిఆర్ వైద్యం హాస్పిటల్‌లో సింహపురి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఈ మెడికల్ క్యాంపులో పేదలకు ఆధునిక వైద్యం అందించాలన్న సంకల్పానికి అంకురార్పణ జరిగిందని, జిల్లాలోని 46 మండలాల్లో కూడా విడతలవారీగా ఉచితవైద్య శిబిరాలు నిర్వహించి, పేదలకు ఉచితంగానే మందులు అందజేస్తామన్నారు. విపిఆర్ ఆసుపత్రి ద్వారా పేదలకు అత్యవసర ఉచిత వైద్యసేవలు అందించడానికి 24×7 అంబులెన్స్‌ను ఏర్పాటు చేసామని,





పేదల కోసం డాక్టర్‌తో సహా అంబులెన్స్ సిద్ధంగా ఉందన్నారు. పాము కాటుకు గురైన వారికి విపిఆర్ హాస్పిటల్‌లో సంబంధిత మెడిసిన్‌ను ఎప్పుడూ ఉచితంగా అందిస్తామన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉచిత పాఠశాలను నిర్వహిస్తున్నామని, విపిఆర్ హాస్పిటల్‌ను పేదల ఉచిత కార్పొరేట్ ఆసుపత్రిగా మలుస్తామన్నారు.

ఈ వైద్య శిబిరంలో గుండె, కీళ్లు, ఎముకలు, మధుమేహం, ఉదరకోశ, గర్భకోశ వ్యాధుల విభాగాలలో దాదాపు 500మందికి పైగా రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విపిఆర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సింహపురి హాస్పిటల్స్ యం.డి కె.రవీంద్రరెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ ఎంసిఎస్‌రెడ్డి, డాక్టర్ టి.శ్రీలక్ష్మి, డాక్టర్ సత్యనాథ్, విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ఆచార్య వి.నారాయణరెడ్డి, విపిఆర్ విద్య ప్రిన్సిపాల్ శ్రీనివాస్, గ్రూప్ పిఆర్ఓ కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నిఘా కళ్లతో నేర నియంత్రణ

## • సాంకేతికత వైపు పోలీస్ చూపు



*ఒక ఎస్పీ సమర్థుడైతే... ఒక జిల్లా ప్రజలు ప్రశాంతంగా ఉంటారు. అసమర్థుడైతే అశాంతితో వుంటారు. ఒక అధికారి సమర్థుడా? అసమర్థుడా? అన్నది అతను తీసుకునే నిర్ణయాలు, పనిలో వేగం, ఆలోచనలలో చురుకుదనం, చేతుల్లో నిజాయితీ, ఆచరణలో చిత్తశుద్ధిని బట్టి ఆధారపడి ఉంటుంది. రౌతు మెత్తనైతే గుర్రం మూడుకాళ్ల మీద పరుగెడుతుందంటారు. పోలీసుశాఖ కూడా ఇంతే! రౌతు లాంటి ఎస్పీ అసమర్థుడైతే గుర్రాల్లాంటి పోలీసుల పని కూడా మూడుకాళ్ల మీద పరుగెత్తినట్లే ఉంటుంది.*

ఒక జిల్లాలో శాంతిభద్రతలకు, ప్రజల క్రమశిక్షణాయుత జీవన విధానానికి ఎస్పీ అమలు చేస్తున్న నిర్ణయాలే ప్రామాణికంగా ఉంటాయి. అయితే పనితీరులో ఒక్కో ఎస్పీ శైలి ఒక్కోవిధంగా ఉంటుంది. ఒక ఎస్పీ ఇద్దరు రౌడీలను ఎన్‌కౌంటర్ చేసి అరాచక శక్తుల గుండెల్లో బాంబులు పేలుస్తాడు. అక్కడే పోలీస్ అంటే రౌడీలకు భయం, సామాన్య జనానికి గౌరవం ఏర్పడుతుంది. గూండాయిజాన్ని ఒక చేత్తో కంట్రోల్ చేస్తూ, ఇంకో పక్క బాధితుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌సెల్ లాంటి ప్రత్యేక కార్యక్రమాలు పెడుతుంటారు. ఒక ఎస్పీ కరువు ప్రాంతాల్లో నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడం వంటి మానవతా కార్యక్రమాలను తన ప్రాధాన్యతగా పెట్టుకుంటే, ఇంకో ఎస్పీ బోడిగాడితోటలో వున్న పిల్లలను స్కూల్‌లో చేర్పించి వారి ఆలనాపాలనా చూడడం తన ప్రాధాన్యంగా పెట్టుకుంటాడు.

ఎవరికి ఎలాంటి ప్రాధాన్యతలున్నా, పబ్లిసిటీ కోసం ఎవరెన్ని స్టంట్‌లు చేసినా ఒక జిల్లాలో శాంతి భద్రతలను కాపాడడం, ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడం, సామాన్య ప్రజలకు భద్రత కల్పించడం, నేరస్థులను పట్టుకోవడం ఒక ఎస్పీ ప్రధానంగా తీసుకోవాల్సిన అంశాలు! నేరాల అదుపుకు ఒక్కొక్కరు ఒక్కో పంథా అనుసరిస్తే, ప్రస్తుత ఎస్పీ విశాల్‌గున్నీ మాత్రం జిల్లాలో నేర నియంత్రణకు, ట్రాఫిక్ అదుపుకు పూర్తి స్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నారు. నేరాల అదుపుకు పోలీసుల కళ్ల కంటే ఆయన సి.సి. కెమెరాల కళ్లనే ఎక్కువగా నమ్మారు. ప్రస్తుతం ఎన్నో నేరాల్లో సి.సి టీవీ ఫుటేజీలే ప్రధాన సాక్ష్యాలుగా ఉంటూ నిందితుల ఆనవాళ్లను అందిస్తున్నాయి. కాబట్టి విశాల్‌గున్నీ కూడా నెల్లూరు నగరాన్ని సి.సి కెమెరాల కళ్లతో బంధించారు. నెల్లూరులోని ప్రధాన రహదారుల మీదంతా సి.సి కెమెరాలు ఏర్పాటయ్యాయి. పాత చెక్‌పోస్ట్ నుండి ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్‌గేట్, రామలింగాపురం జంక్షన్, అన్నమయ్య సర్కిల్ మీదుగా అయ్యప్పగుడి వరకు, అక్కడ నుండి ట్రంకురోడ్డు మీదుగా బోసుబొమ్మ వరకు, అలాగే కొత్తూరు నుండి సంతపేట వరకు... ప్రధాన నగరమంతా కవరయ్యేలా సి.సి కెమెరాల ఏర్పాటు జరుగుతోంది. ఇప్పటికే 90శాతం కెమెరాల ఏర్పాటు పూర్తయ్యింది. జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ కెమెరాలన్నింటినీ అనుసంధానిస్తూ కమాండ్‌కంట్రోల్ సిస్టం (డ్రాగన్ రూమ్)ను ఏర్పాటు చేశారు. ఈ రూమ్‌లో నిపుణులైన పోలీసు సిబ్బంది కూర్చుని ఏ ప్రాంతంలో ఏం జరుగుతుంది, ఎక్కడ ట్రాఫిక్‌జాం అయ్యింది... అన్నది చూస్తుంటారు. సమస్య పరిష్కారానికి వెంటనే సంబంధిత స్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేస్తారు. ఈ డ్రాగన్ రూమ్‌కు ఎస్పీనే ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తారు. నెల్లూరు నగరంలో దాదాపు 110 సి.సి.కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. భవిష్యత్‌లో ప్రధాన రోడ్లలోనే కాకుండా స్థానికులు ఆసక్తితో ముందుకు వస్తే జనావాసాల కాలనీలు, వీధులలో కూడా సి.సి కెమెరాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ సి.సి కెమెరాల వల్ల ఎక్కడ ఏ సంఘటన జరిగినా నిందితులను సులభంగా పసిగట్టే అవకాశముంటుంది. అదీగాక సి.సి కెమెరాల నిఘా వుందంటే నేరస్తులు కూడా భయపడే అవకాశముంది.

ఒక్క నెల్లూరు నగరంలో కాకుండా కావలి, గూడూరులలో కూడా సి.సి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆత్మకూరులో ఎస్‌ఐగా వేణుగోపాలరెడ్డి ఉన్నప్పుడే స్థానిక ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి సహకారంతో సి.సి కెమెరాలు ఏర్పాటు చేయించారు.

ఇక కృష్ణపట్నంపోర్టు పరిధిలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలు, ఆయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీలు, మేనకూరు సెజ్, శ్రీసిటి సెజ్ లలోని పరిశ్రమలలో కూడా సి.సి కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని పోలీసు ఆఫీసులోని కమాండ్ కంట్రోల్ సిస్టంతో అనుసంధానించనున్నారు. ఈ ఫ్యాక్టరీల పరిధిలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఆయా పోలీసుస్టేషన్‌లలో వీటికి సంబంధించిన కేసులు ఎక్కువగానే నమోదవుతుంటాయి. కాబట్టి సెజ్‌లలో నేరాల అదుపుకు కూడా సి.సి కెమెరాలు ఉపయోగపడతాయి.

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్థంగా ఉంటుంది. ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు వాహనాలు నడుపుతుంటారు. అడ్డదిడ్డంగా దూరేస్తుంటారు. రాంగ్‌సైడ్ రైడింగ్ ఎక్కువగానే ఉంటుంది. వాహనాలను ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేసి పోతుంటారు. సి.సి కెమెరాల పని మొదలైతే నగరంలో మొదట ట్రాఫిక్ బాగుపడుతుంది. జిల్లాలో నేర నియంత్రణనకు ఎస్పీ విశాల్‌గున్నీ ఈ విధానాన్ని ఎంచుకున్నారు. నిందితులను సాక్ష్యాలతో సహా పట్టించే మార్గమిది. కాబట్టి ఎవరూ ప్రశ్నించలేరు! త్వరలోనే డిజిపి చేతుల మీదుగా ఈ కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



## మీ జీతాలు తప్ప...

# రోగుల జీవితాలు పట్టవా?

### పెద్దాసుపత్రి జబ్బు చూసి కలెక్టర్‌కే బి.పి వచ్చింది



ఎవరన్నా రోగాలు నయం కావడం కోసం ఆసుపత్రులకు వెళతారు. కాని నెల్లూరులోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాల అనబడే పెద్దాసుపత్రికి వెళితే మాత్రం లేని రోగాలను తెచ్చుకుంటారు. ఇక్కడ రోగాలు రెండు రకాలుగా వస్తాయి. మొదటిది అక్కడ వున్న చెత్తాచెదారం, పందులు వంటి అపరిశుభ్రవాతావరణం వల్ల వచ్చే రోగాలు! రెండోది అక్కడున్న పరిస్థితులు చూసి కడుపు మండితే వచ్చే బి.పి వంటి రోగం. ఈ నెల 7వ తేదీన పెద్దాసుపత్రికి వచ్చిన కలెక్టర్ ముత్యాలరాజుకు కూడా అక్కడున్న వాతావరణం చూసేసరికి ఒంట్లో రక్త ప్రసరణ 200కిలోమీటర్ల వేగంతో ప్రవహించినట్లుంది... అక్కడున్న వైద్యాధికారులు, ఇంజనీర్లపై కారాలు మిరియాలు నూరేశారు. ప్రశ్నలతో వాళ్లను నిలువునా కడిగేసారు.

ఆసుపత్రిలో అభివృద్ధి సమావేశం జరుగగా, కలెక్టర్ ముత్యాలరాజు పాల్గొని అక్కడ నెలకొన్న పరిస్థితులపై అసహనం వ్యక్తం చేసారు. వారంరోజుల్లో ఆసుపత్రి ప్రాంగణంలో పందులు, చెత్తదిబ్బల బదులు పచ్చని మైదానం వుండాలని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం చూపితే ప్రభుత్వానికి సరెండర్ చేస్తానంటూ వైద్య శాఖాధికారులకు ఘాటుగానే చెప్పారు. ఆసుపత్రి ప్రాంగణంలో భవన నిర్మాణాల ఆలస్యం విషయంలో ఇంజనీరింగ్ అధికారులపై కూడా ఆయన నిప్పులు కక్కారు. ఆసుపత్రిలో నర్సింగ్ స్టాఫ్‌ను వెంటనే భర్తీ చేయాలని ఆదేశించారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు, డిసిహెచ్ సుబ్బారావు, అభివృద్ధి కమిటి సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి, సంపత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు రత్నాలు



జాతీయ ఒలింపిక్స్ కాంగ్రెస్ - 2016 జిల్లా స్థాయి శాస్త్రీయ పోటీలలో డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యార్థులు అసాధారణ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో 207 ప్రాజెక్టులు పోటీ పడగా అందులో 10ప్రాజెక్టులు మాత్రమే రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. వాటిలో నెల్లూరు సరస్వతినగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ స్కూల్‌కు చెందిన జట్టు, డాక్టర్ కిషోర్స్ రత్నం సివి రామన్ స్కూల్‌కు చెందిన జట్టు ఎంపికయ్యాయి. డిసెంబర్ 3, 4తేదీలలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ రెండు జట్లు పాల్గొంటాయి. ప్రతిభ చూపిన ఈ విద్యారత్నాలను ఇటీవల డిఇఓ మువ్వా రామలింగం స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో అభినందించారు.

## నగరంలో పరీక్షల సందడి

ఒకేరోజు నాలుగు రకాల పోటీ పరీక్షలు నిర్వహించడంతో ఈ నెల 6వ తేదీన నెల్లూరులో ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థలు విద్యార్థులు, అభ్యర్థులతో కళకళలాడాయి. 32కేంద్రాల్లో పోలీసు నియామక పరీక్షలు నిర్వహించారు. 14248 మంది అభ్యర్థులు ఆ పరీక్షలు వ్రాసారు. 12 కేంద్రాల్లో 10వ తరగతి విద్యార్థులకు నేషనల్ టాలెంట్ సెర్చ్ టెస్ట్ నిర్వహించగా, 2441మంది ఆ పరీక్షలు వ్రాసారు. 8వ తరగతి విద్యార్థులకు 11కేంద్రాల్లో నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించగా 2401 మంది హాజరయ్యారు. అలాగే ఐబిపిఎస్ ఆర్‌ఆర్‌బి ఆఫీసర్ స్కేల్-1 పరీక్ష కూడా అదేరోజు నిర్వహించడంతో ఎటు చూసినా పరీక్షల వాతావరణమే కనిపించింది.

### 13న నెల్లూరులో...

# 3 జిల్లాల బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం

బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తూ, వారి సమస్యల సాధనకు నిరంతరం శ్రమిస్తున్న ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య (ఏపిబిఎస్ఎస్) ఈ నెల 13న నెల్లూరులో పెద్దఎత్తున బ్రాహ్మణ ప్రాంతీయ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తోంది.

రాష్ట్ర విభజన తరువాత బ్రాహ్మణజాతి సంక్షేమాన్ని పట్టించుకునే సంస్థలు కరువైన సమయంలో 13 జిల్లాల బ్రాహ్మణ ప్రముఖులు గత ఏడాది నెల్లూరులో సమావేశమై ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య పేరుతో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏర్పరుచుకుని బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, వచ్చే ఆదివారం(13వతేది) ఉదయం 10గంటలకు నెల్లూరులోని రంగనాయకులపేటలో వున్న శ్రీ రంగనాయక స్వామి కళ్యాణ మండపంలో నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేస్తున్నట్లు ఆ సమాఖ్య కార్యక్రమాల చీఫ్ కో-ఆర్డినేటర్ యామిజాల రామనరసింహం (రాంజీ), ముఖ్య సలహాదారుడు స్వయంపాకుల శ్రీనివాసులు తెలియజేశారు.

ఈ సమావేశానికి శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా బ్రాహ్మణ సేవాసంఘాల సమితి అధ్యక్షుడు గుడ్లదొన వాసుదేవరావు అధ్యక్షత వహిస్తారని, ముఖ్యఅతిధులుగా బాపట్ల ఎమ్మెల్యే కోనా రఘుపతి, మాజీ కేంద్రమంత్రి, తెలంగాణ ప్రభుత్వ అధికారప్రతినిధి డా.సముద్రాల వేణుగోపాలాచారి(న్యూఢిల్లీ), బద్వేలు మాజీ ఎమ్మెల్యే డా.వి.శివరామకృష్ణ, విజయవాడ మాజీఎమ్మెల్యే మల్లాది విష్ణు, విశాఖ మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్, రిటైర్డ్ డిజిపి కరణం అరవిందరావు, కార్పొరేటర్, మరియు జిల్లా కో-ఆర్డినేటర్ ఉచ్చి భువనేశ్వరిప్రసాద్‌లతో పాటు ఏపిబిఎస్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం.శివకృష్ణప్రసాద్, ఎన్.వెంకట రామరాజు, సిరిపురం శ్రీధరశర్మ, కొత్తపల్లి అజయ్‌కుమార్, జి.గౌరీశంకర్, కె.ఆర్ బాలాజీ, డా.పిఎస్ఆర్‌కె మూర్తి, ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొంటారని, స్వయంపాకుల శ్రీనివాసులు సభను నిర్వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బ్రాహ్మణ ప్రముఖులు ఈ సమావేశంలో పాల్గొని బ్రాహ్మణజాతి అభ్యున్నతికి, వారి ఉద్యోగ, నివాస, వివాహ, ఉపాధి రంగాల అభివృద్ధికి తగు సలహాలు సూచనలు ఇస్తారని వారు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్రాహ్మణ అభివృద్ధికి ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ యొక్క అభివృద్ధి పథకాలను ప్రజల్లో వ్యాప్తి చేస్తూ, ఆ మేరకు వారిని చైతన్యవంతం చేసేందుకు తగు సలహాలనిచ్చేందుకు బ్రాహ్మణ ప్రముఖులంతా ఈ సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు. బ్రాహ్మణజాతి అభ్యున్నతికి సహకరిస్తూ బ్రాహ్మణులంతా ఈ సమావేశానికి వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా బ్రాహ్మణ సేవాసంఘాల సమితి కార్యవర్గం, నెల్లూరు నగర బ్రాహ్మణ యువజన సేవా సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నెల్లూరు కబుర్లు



## క్రికెట్ లెజెండ్ వస్తున్నాడు!

క్రికెట్ క్రీడా చరిత్రలో ఎన్నో రికార్డులను తునా తునకలు చేసి, మరెన్నో రికార్డులను తన పేరు మీద నమోదు చేసుకున్న మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ఈ నెల 16వ తేదీన నెల్లూరుజిల్లాకు రానున్నారు. తాను దత్తత తీసుకున్న గూడూరు మండలంలోని పుట్టంరాజుకండ్రిక గ్రామాన్ని ఆయన సందర్శించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. రెండేళ్ల క్రితం అప్పటి జాయింట్‌కలెక్టర్ రేఖారాణి చొరవతో సచిన్ ఈ గ్రామాన్ని అభివృద్ధి కోసం దత్తత తీసుకోవడం తెలిసిందే! అప్పుడు అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు ఆయనే స్వయంగా ఈ గ్రామానికి వచ్చారు. అభివృద్ధి పనులకు తన ఎంపీ నిధులను విడుదల చేశారు. ఈ మధ్యలో సచిన్ పిఏ అప్పుడప్పుడూ వచ్చి ఇక్కడ పనులను పర్యవేక్షిస్తున్నారు. తన దత్తత గ్రామం ఎంతగా మారిందో, అక్కడ ఏ మేరకు అభివృద్ధి జరిగిందో స్వయంగా చూసుకోవడానికి సచిన్ ఇంకోసారి వస్తున్నారు.

## మాడరన్ స్కూల్లో ఫ్రూట్స్ & వెజిటబుల్స్ షో



ఈ నెల 5న నెల్లూరు సరస్వతీ నగర్‌లోని మాడరన్ స్కూల్‌లో చిట్టి చిన్నారుల వెజిటబుల్స్ & ఫ్రూట్స్ షో జరిగింది. కిండర్ గార్టెన్ విద్యార్థినీ విద్యార్థులు ఈ ప్రదర్శనను నిర్వహించారు. ఇందులో వివిధ రకాలైన దాదాపు రెండు వందలకు పైగా కాయగూరలు, పండ్లను ప్రదర్శించారు. వెజిటబుల్ కార్వింగ్ - పుచ్చకాయతో కోతిబొమ్మ, సొరకాయతో హంస, తర్బూజాతో రాక్షసి, ఆపిల్‌తో బాతు, కీరాతో అందమైన పువ్వులు, క్యారెట్‌తో విమానం, కాకరకాయతో ఎలుక, సొరకాయ, ద్రాక్షతో కలిపి ముళ్లపంది, క్యాబేజీ, క్యారెట్‌తో కలిపి కోన్ ఐస్‌క్రీమ్, కొబ్బరికాయలతో గణపతి మొదలైనవి తయారు చేశారు. కాయగూరలు, పండ్ల గురించి, వాటి పోషక విలువల గురించి విద్యార్థినీ విద్యార్థుల విశ్లేషణ ఆహూతులను ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో చిన్నారులు కాయగూరలు, పండ్లతో డిజైన్ చేయబడిన ఫ్యాన్సీ డ్రస్‌లతో చూపర్లను ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శనను విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించి ఆనందించారు. ఈ కార్యక్రమంలో మాడరన్ స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ రవికుమార్ పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులను ప్రశంసించారు.

## కబడ్డీలో గీతాంజలి విద్యార్థుల ప్రతిభ



గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు బుధవారం తిరుపతిలోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సౌత్‌జోన్ కబడ్డీ విశ్వవిద్యాలయ స్థాయి సెలక్షన్స్‌లో ఎంపికై తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ ఎంపికల్లో కె.ప్రవీణ్, డి.హేమంత్‌రెడ్డి, యు.దినేష్, యం.జ్ఞానేష్‌లు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ ఎన్.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొ॥ డా॥ జి.సుబ్బారావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ స్థాయిలో సౌత్‌జోన్ పోటీలకు కళాశాల తరఫున నలుగురు విద్యార్థులను పంపగా అందరూ సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక కావడం ఒక విశేషమన్నారు. ఇది యూనివర్సిటీ స్థాయిలో చెప్పుకోదగ్గ విషయమన్నారు. ఎంపికైన విద్యార్థులు వచ్చే నెలలో తమిళనాడులోని చెన్నైలో జరిగే సౌత్‌జోన్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల పి.డి పి.అశోక్‌కుమార్, మెకానికల్ విభాగాధిపతి వి.వెంకయ్య, ప్రణయ్‌కుమార్, సివిల్ విభాగం అసిస్టెంట్ హెచ్‌ఓడి సి.ప్రకాష్ పాల్గొన్నారు.

## వాత్సల్యకు విరాళం

నెల్లూరు కొండాయపాలెం రోడ్డులోని వాత్సల్య అనాధాశ్రమంకు అలంకార్ జ్యూయలరీ అధినేత భవన్‌లాల్ జైన్ 25వేల రూపాయల విరాళం అందజేశారు. సంస్థ కార్యదర్శి సాంబశివరావుకు ఈ విరాళం అందజేయగా ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి అధ్యక్షులు భరత్‌కుమార్ జైన్, ఎస్.పి.జైన్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుల దీపం.. సేవల ప్రతిరూపం...

# నేదురుమల్లి ఫౌండేషన్



పేద విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహిస్తూ, సేవాపరమార్థంతో పని చేస్తున్న నేదురుమల్లి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్ పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీన కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో చదివే ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దీపావెంకట్ మాట్లాడుతూ నేదురుమల్లి ఫౌండేషన్ ద్వారా అందజేస్తున్న స్కాలర్‌షిప్‌లు ప్రతిభావంతులైన విద్యార్థుల్లో మంచి ఆశయాన్ని ఏర్పరుస్తాయమన్నారు. ఎన్‌బికెఆర్ విద్యాసంస్థలకు దేశంలోనే గుర్తింపు వుందని, పేద, దళిత విద్యార్థుల చదువుల కోసం మహనీయులు ఏర్పాటు చేసిన ఈ విద్యాసంస్థ దినదిన ప్రవర్ధమానమై ఇంకా ఎన్నో లక్షల మంది విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. ఇంజనీరింగ్ తొలి సంవత్సరం నుండే ప్రతి విద్యార్థి ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తే వారి భవిష్యత్ బంగారు మయమవుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ విద్యాసంస్థల ప్రగతి కోసమే కాకుండా, ఇక్కడ చదివే విద్యార్థుల భవిష్యత్ కోసం కూడా కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎంతో ఆలోచనతో నిర్ణయాలు తీసుకుంటుండడం హర్షించదగ్గ విషయమన్నారు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న అనంతపురం జెఎన్‌టియు రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ ఇదే కళాశాలలో చదువుకుని ఒక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ స్థాయికి ఎదిగానని, నా దృష్టిలో ఇది దేవాలయమన్నారు. మరో విశిష్ట అతిథి గూడూరు డిఎస్‌పి బి.శ్రీనివాస్ మాట్లాడుతూ క్రమశిక్షణకు ఎన్‌బికెఆర్ పెట్టింది పేరన్నారు. విద్యార్థులు కష్టపడి విలువైన కాలాన్ని వృధా చేయకుండా ఇష్టపడి చదువుకోవాలన్నారు. కరస్పాండెంట్ రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌బికెఆర్‌లో చదివిన విద్యార్థులు నేడు ప్రపంచంలోనే వివిధ దేశాలలో ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం ఈ సంవత్సరం ప్రతిభ కనపరచిన 135మంది విద్యార్థిని విద్యార్థులకు దీపా వెంకట్ చేతులమీదుగా నగదు పురస్కారాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మెన్ డా॥ ఐ.గోపాల్‌రెడ్డి, డైరక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






## డాక్టర్ సి.ఎస్.శ్రీనివాసరాజుకు సత్కారం

# వేలగుండెల్లో ఒదిగిన 'వైద్యరత్నం'

మనిషికి ప్రాణం గుండె. అది పని చేయడం ఆగిందంటే మనిషి జీవన ప్రయాణం అక్కడితో ముగిసినట్లే! గుండె యంత్రాలు మరమ్మత్తులకు గురైనప్పుడు వాటిని రిపేరు చేస్తూ మళ్లీ వాటిని ట్రాక్‌పైకి ఎక్కిస్తున్న మెకానిక్ మాంత్రికుడు, కిమ్స్(బొల్లినేని) ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చేజర్ల శేష శ్రీనివాసరాజును 'వైద్యరత్న' బిరుదు ప్రదానంతో నెల్లూరీయులు ఘనంగా సత్కరించారు.

కిమ్స్ హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిస్ట్‌గా 20వేల గుండె ఆపరేషన్లను ఆయన విజయవంతంగా పూర్తి చేసిన తరుణంలో ఈ నెల 4న టౌన్‌హాల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ బిరుదు ప్రదానం జరిగింది. ప్రకాశం జిల్లా ఎస్పీ త్రివిక్రమవర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, కిమ్స్ ఆసుపత్రుల అధినేత డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు, రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం, మురళీకృష్ణ హోటల్స్ అధినేత గ్రోసు గోపాలయ్య, వీరిశెట్టి హజరత్‌బాబు, కావలి ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, మంత్రి నారాయణ ఓఎస్‌డి సి.హెచ్.పెంచలరెడ్డి అతిథులుగా పాల్గొని శ్రీనివాసరాజుకు ఆత్మీయసత్కారం అందజేశారు. అతిథులందరు కూడా తమ ప్రసంగాలలో వైద్యరంగానికి శ్రీనివాసరాజు అందించిన సేవలను కొనియాడారు. శ్రీనివాసరాజు తన ప్రసంగంలో తన ఈ స్థాయికి కారణ మైన ముగ్గురు వ్యక్తులను గుర్తు చేసుకుని వారికి కృతజ్ఞతలు తెలుపుకోవడం ఆయనలోని నిరాడంబరతకు, నిజాయితీ దృక్పథానికి అద్దం పడుతుంది. నాకు జీవితాన్ని ప్రసాదించింది తల్లిదండ్రులు. కాని ఆ జీవితాన్ని ముగ్గురు వ్యక్తులు అద్భుతంగా మలిచారు. చిన్నప్పుడు నాకు సైన్స్ మీద ఆసక్తి కలిగించిన వనజాక్షి టీచర్‌ను, 1983లో కేవలం నెలరోజుల్లోనే నాకు శిక్షణనిచ్చి మెడిసిన్‌లో రాష్ట్ర స్థాయి 23వ ర్యాంకు రావడానికి కారణమైన రత్నం మాస్టార్‌ని, వైద్యుడిగా తనను ఎంతగానో అభిమానించి ఆదరించిన డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావును జీవితాంతం గుర్తుపెట్టుకునే వుంటానన్నారు శ్రీనివాసరాజు. నేను రోగికి చిరునవ్వుతో వైద్యం చేస్తాను, అదే చిరునవ్వును వారిలోనూ చూడాలనుకుంటాను, నా దగ్గరకు ఒకసారి అనారోగ్యంతో వచ్చిన పేషంట్ మళ్లీ నా వద్దకు ఆరోగ్యంగా రావాలని కోరుకుంటాను. నాకు జీవితంలో సంతృప్తి మిగిల్చేది వైద్యసేవే! నా ఒంట్లో శక్తి వున్నంత వరకు ప్రజలకు వైద్యం చేస్తూనే ఉంటానని ఆయన పేర్కొన్నారు.

## సిఐఐ సభ్యత్వంతో...

# పరిశ్రమలకు ప్రయోజనం

### - సిఐఐ ఎపి వైస్‌ఛైర్మెన్ జెఎస్‌ఆర్‌కె ప్రసాద్




సిఐఐ సభ్యత్వంతో పరిశ్రమలకు ఎంతో ప్రయోజనమని సిఐఐ ఎపి వైస్‌ఛైర్మెన్ జెఎస్‌ఆర్‌కె ప్రసాద్ తెలిపారు. సోమవారం కృష్ణపట్నంపోర్టులో సిఐఐ సభ్యత్వ నమోదు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐఐ ద్వారా పరిశ్రమలు ఎదుర్కొనే అనేక సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. పెరుగుతున్న టెక్నాలజీతో మ్యాన్‌ఫ్యాక్చరింగ్ పరిశ్రమలు ఎదుర్కొనే సవాళ్లను పరిష్కరించుకునేందుకు సిఐఐ సహకారం ఉంటుందన్నారు. సిఐఐకి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపుతో పాటు సమాఖ్య సభ్యత్వంతో పారిశ్రామికవేత్తలు పలు ప్రయోజనాలు పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. 9రకాల నిపుణులతో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కేంద్రాలను సిఐఐ నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. సిఐఐ ద్వారా 8వేల మంది నేరుగా ప్రయోజనం పొందుతున్నారన్నారు.

సిఐఐ నెల్లూరు జోన్‌గా ఏర్పాటు చేసేలా కృషి చేయాలని కృష్ణపట్నం పోర్టు సిఇఓ అనిల్ ఎండ్లూరి తెలిపారు. కృష్ణపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలతో పాటు రాబోవు పరిశ్రమలు సిఐఐ సభ్యత్వం తీసుకోవాలని ఆయన సూచించారు. సిఐఐ సభ్యత్వంతో పరిశ్రమల వారికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని సిఐఐ తిరుపతి జోన్ ఛైర్మెన్ విజయ్‌నాయుడు గల్లా పేర్కొన్నారు. కృష్ణపట్నం పోర్టు పరిశ్రమల నిలయమని ప్రతి ఒక్క పారిశ్రామికవేత్త సిఐఐలో సభ్యత్వం పొందడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయన్నారు.

# మేకిన్ ఇండియాలో ఓ ముందడుగు

### • లక్నో సిటికి శ్రీసిటీ-ఆల్‌స్టామ్ మెట్రో రైళ్లు




లక్నో మెట్రో ప్రాజెక్ట్ కోసం శ్రీసిటీలోని ఆల్‌స్టామ్ పరిశ్రమలో తయారైన మొదటి సెట్ మెట్రో రైళ్లను ఇటీవల లక్నోకు తరలించారు. దీనిని పురస్కరించుకుని ఆల్‌స్టామ్ పరిశ్రమ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ మంత్రి యాసర్‌షాకు ఆల్‌స్టామ్ ఎండీ లాంఛనంగా మెట్రో రైల్ తాళాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యూపి ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్, ఆ రాష్ట్ర ప్రజల తరపున లక్నో మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులకు, ఆల్‌స్టామ్ టీమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ రాష్ట్ర అభివృద్ధి పథంలో మెట్రో ప్రాజెక్ట్ చాలా కీలకమైందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో నాలుగు నగరాల్లో మెట్రో రైళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

శ్రీసిటి ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి ఆల్‌స్టామ్ టీమ్‌కు అభినందనలు తెలిపారు. లక్నోకు మెట్రో రైల్ సరఫరాతో ఆల్‌స్టామ్ మరో మైలురాయిని అధిగమించిందన్నారు. శ్రీసిటీకి కూడా ఇది సంతోషకరమైన రోజన్నారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా 'మేడ్ ఇన్ శ్రీసిటీ' మెట్రో రైళ్లు నేడు లక్నోకు తరలించడం జరిగిందన్నారు.

కాగా, లక్నో మెట్రో ప్రాజెక్ట్ కోసం గత ఏడాది సెప్టెంబర్‌లో లక్నో మెట్రో రైల్ కార్పొరేషన్‌తో ఆల్‌స్టామ్ సంస్థ 150 మిలియన్ యూరోల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో భాగంగా 20మెట్రో రైల్ సెట్లను తయారు చేయనుంది. ఒక్కో సెట్లో నాలుగు మెట్రో కార్లు వుంటాయి. దీంతో పాటు సిగ్నలింగ్ సొల్యూషన్స్, ఇతర కంట్రోలింగ్ వ్యవస్థను తయారు చేయనుంది. ఈ కార్యక్రమంలో యుపి ముఖ్యమంత్రి ప్రత్యేక సలహాదారు అలోక్ రంజన్, యుపి రాష్ట్ర ముఖ్యకార్యదర్శి రాహుల్ భట్నాగర్, లక్నో మెట్రో రైల్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కుమార్ కేశవ్, ఎల్‌ఎంఆర్‌సికి చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు రెవెన్యూ సర్వీసెస్ ఎన్నికలు

ఇప్పటివరకూ వాయిదా పడుతూ వచ్చిన కలెక్టరేట్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం నెల్లూరు గోల్డెన్‌జూబ్లీహాల్లో ఎట్టకేలకు జరిగాయి. అధికారి సుధాకర్‌రావు ఎన్నికలు జరిపించారు. గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చొప్పా రవీంద్రబాబు బలపరిచిన మనోహర్ ప్యానల్ ఒక వర్గంగా, కాయల సతీష్, షఫీమాలిక్ బలపరచిన చంద్రశేఖర్ వర్గం మరో ప్యానల్‌గా ఏర్పడి పోటీ చేసింది. కలెక్టర్ డివిజన్‌కు సంబంధించి మొత్తం 172ఓట్లకి గాను 124ఓట్లు పోలయ్యాయి. 104ఓట్లు పొందిన చొప్పా రవీంద్రబాబు ప్యానల్ భారీ మెజార్టీతో గెలుపొందింది. ప్రత్యర్థి ప్యానల్‌కు కేవలం 20ఓట్లు వచ్చాయి. ఎన్నికల రాష్ట్ర పరిశీలకులుగా మధుసూదనరావు వ్యవహరించారు.



## గూడూరు డివిజన్ వార్తలు

# రక్తదానం ప్రాణదానంతో సమానం



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ పొనకా దేవసేన, పక్కన శివకుమార్‌రెడ్డి తదితరులు

రక్తదానం ప్రాణదానంతో సమానమని, సృష్టిలో ఎవరూ సృష్టించలేనిది రక్తం మాత్రమేనని, అందుకే రక్తదానం చేసిన వారు ప్రాణదాతలతో సమానమని గూడూరు మునిసిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన అన్నారు. ఈ నెల 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరులోని జిఎస్ఆర్ మునిసిపల్ పాఠశాలలో ఉపాధ్యాయులు రక్తదానం నిర్వహించనున్నారని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. అందుకు సంబంధించిన గోడపత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. రక్తదానం ఎంతో పవిత్రమైన కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక్కసారైనా రక్తదానం చేసి ప్రాణదాతగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త పొనకా శివకుమార్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మున్వర్ బాషా, పరంజ్యోతి, సమన్వయకర్త వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయులు శశికళ, మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

# పుట్టంరాజువారి కండ్రిగలో మెగా జాబ్‌మేళా

గూడూరు మండలంలోని పుట్టంరాజు కండ్రిగలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతీ యువకులకు చదువు ఎంత ముఖ్యమో జీవితంలో ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులకు సాయపడడం అంతే ముఖ్యమన్నారు. తల్లిదండ్రులకు తమ బిడ్డలు తాము సంపాదించిన తొలిజీతం ఇస్తే వారు పొందే సంతోషం వెలకట్ట లేనిదని అన్నారు. ప్రముఖ క్రికెటర్ సచిన్ దత్తత తీసుకున్న ఈ గ్రామంలో నిర్వ హించిన జాబ్‌మేళాకు వచ్చిన యువతీ యువకులతో ఆయన సమావేశమయ్యారు. 2300 మందికి గాను 880 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, అయితే జీతం తక్కువని అధైర్యపడకుండా చేసే పనిలో నైపుణ్యం, ప్రతిభాపాటవాలు చూపితే మరిన్ని మంచి అవకాశాలు అవే వస్తా యన్నారు. అనంతరం పుట్టంరాజు కండ్రిగలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్, డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, డిఆర్‌డిఎ పి.డి లావణ్యవేణి, మెప్మా పి.డి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# కొళాయిల పన్ను బకాయిలు చెల్లించండి

## - మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి



గూడూరు మునిసిపల్ పరిధిలో కొళాయిల పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని పురపాలక కమిషనర్ చంద్రశేఖరరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గూడూరులోని 17వ వార్డులో మరమ్మతులకు గురైన పైప్‌లైన్‌ను ఆయన ఇటీవల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొళాయిల అక్రమ కనెక్షన్లను వెంటనే క్రమబద్ధం చేసుకోవాలని, అక్రమ కనెక్షన్లతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నెలాఖరులోగా సంబంధిత వ్యక్తులు కొళాయిల పన్ను చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

# దోమల నివారణకు చర్యలు



కాలువల్లో పూడికలు తీయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి

గూడూరు మునిసిపాలిటీలోని 31వ వార్డులో కాలువల పూడికలు తీస్తున్నామని, దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. రమణారెడ్డి తెలియజేశారు. ఇటీవల పట్టణంలోని 25, 29, 30, 32, 33వార్డుల్లో కూడా కాలువల పూడికలు తీసి దోమలు రాకుండా నివారణ చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం రానున్న వర్షాకాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పారిశుద్ధ్య సిబ్బంది సహకారంతో కాలువల్లో పూడికలు తీస్తున్నామని, కాలువల వద్ద, రోడ్లమీద దోమలు నిలవకుండా బ్లీచింగ్ వేస్తున్నామని, పిచ్చిమొక్కలను తొలగిస్తున్నామని అన్నారు. అంగళ్ళు, హోటళ్ళలో తనిఖీలు చేస్తున్నామని, ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధించాలని అందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# జిఎస్‌టిలో 'సరఫరా'కే పెద్దపీట

**జిఎస్‌టిపై పరిశీలన-5**



చిన్ని శ్రావణ్‌కుమార్
చార్టర్డ్ అకౌంటెంట్
e-mail: chinnisravankumar@gmail.com

జిఎస్‌టి చట్టంలోని సెక్షన్ 2 (2)లో ప్రతిఫలాన్ని నిర్వచించడం జరిగింది. ప్రతిఫలం ఏ రూపంలో అయినా కావచ్చు. ఇష్టపూర్వకంగాను బలవంతంగాను ఇచ్చినను అది ప్రతిఫలం కిందికే వస్తుంది.

ఏ వ్యక్తి అయినా వస్తుసేవలు వినియోగానికి డిపాజిట్ కట్టి, కట్టిన డిపాజిట్ తిరిగి ఇచ్చినను ఇవ్వకున్నను ప్రతిఫలం కిందికి రాదు. ఒకవేళ సదరు వ్యక్తి కనుక దీనిని ప్రతిఫలం క్రిందికి తీసుకురావడానికి ప్రయత్నిస్తే డిపాజిట్ ప్రతిఫలం క్రిందకు వస్తుంది.

జిఎస్‌టిలోని షెడ్యూలు-1 ప్రకారం ప్రతిఫలం లేని లావాదేవీలను కూడా సరఫరా కిందికి తీసుకురావడం జరిగింది.

ఏ) వ్యాపార ఆస్తులను శాశ్వతంగా అమ్మడం లేక బదిలీ చేయడం

**ఉదా :** ఎక్స్ అనేసంస్థ వ్యాపార ఆస్తులను వై అనే వ్యక్తికి సంస్థకి అమ్మింది. జిఎస్‌టి ప్రకారం ఈ అమ్మకాన్ని సరఫరా పరిధిలోకి తీసుకువచ్చి పన్ను విధించడం జరుగుతుంది.

ఏ) వ్యాపార ఆస్తులను వ్యాపారేతరంగా తాత్కాలికంగా వాడుకోనడం

సి) వ్యాపార సేవలను వ్యాపారేతరంగా వాడితే

**ఉదా :** తాజ్ హోటల్‌లో రతన్ టాటా బసచేస్తే ఆయన ఆ సంస్థకు ఛైర్మెన్ అయినప్పటికీ జిఎస్‌టి పరిధిలో సేవలుగా పరిగణించి పన్ను విధించడం జరుగుతుంది.

డి) రిజిస్ట్రేషన్ రద్దు అయిన తర్వాత మిగులు ఆస్తులు / అమ్మకానికి ఉంచిన వస్తువులు.

ఇ) వ్యాపార నిమిత్తం జిఎస్‌టి పన్ను పరిధిలోని వ్యక్తి వస్తు సేవలను మరో పన్ను కట్టవలసిన లేదా పన్ను పరిధిలోకిని రాని వ్యక్తికి అందిస్తే

సెక్షన్ 43-ఏలో నిబంధనలకు అనుగుణంగా పన్ను పరిధిలోని వ్యక్తి జాబ్‌వర్కర్‌కు చేసిన సరఫరా పన్ను పరిధిలోకి రాదు.

వ్యాపారానుగుణంగా ఇతర రాష్ట్రాలలో బ్రాంచ్ కలిగివుండి వాటికి తరలించిన స్టాక్‌కి ఎటువంటి ప్రతిఫలం లేకపోయినను జిఎస్‌టి కింద పన్ను వేయడం జరుగుతుంది.

**3) సరఫరా అనేది వ్యాపార నిమిత్తం జరగాలి:**

సరఫరాలు వ్యాపార నిమిత్తం జరిగితేనే అవి జిఎస్‌టి పరిధిలోకి వస్తాయి. జిఎస్‌టి అనేది వివిధ దశలలో పెరిగే విలువపై విధించేదే కానీ ఒకేసారి విధించే పన్ను కాదు.

**ఉదా :** ఎక్స్ అనే వ్యక్తివద్ద ఉద్యోగిగావున్న వ్యక్తి కొనే కారును అమ్మితే దానిపై జిఎస్‌టి వేయడం జరుగదు. ఒక వ్యక్తి చేసే లావాదేవీలు వ్యాపారపరమైనవా లేక వేరే విధమైనవా అనేది వారియొక్క పూర్తి లావాదేవీలను పరిశీలించిన తర్వాతే తెలుస్తుంది.

**ఉదా :** శ్రీమతి ప్రవల్లిక గృహిణి. ఆమె ఇంటిలో వుండే పాత పెయింటింగ్‌ని అమ్మితే లేక సరఫరా చేస్తే అది జిఎస్‌టి పరిధిలోకి రాదు. అదేవిధంగా బాపు బొమ్మలను అమ్మితే లేక సరఫరా చేస్తే అది జిఎస్‌టి పరిధిలోకి వస్తుంది. వ్యాపారాన్ని జిఎస్‌టి చట్టంలోని సెక్షన్ 2 (9)లో వివరించడం జరిగింది.

**4) సరఫరా ఏ ప్రదేశంలో జరిగిందో తెలియాలి :**

జిఎస్‌టి అనునది వినియోగంపై వేసే పన్ను కనుక పన్ను పరిధిని ఖచ్చితంగా నిర్ధారించాలి. పన్ను పరిధిని నిర్ధారించారు కాబట్టి ఎగుమతులపై సున్నా పన్ను (జీరో రేటెడ్) దిగుమతులపై రివర్స్ చార్జ్ వేయడం జరిగింది. ఎగుమతులు జీరో రేటు కనుక వానిపై ఎలాంటి పన్ను విధించడం జరగదు. దీనివలన మనం కట్టిన పన్నును ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌గా తిరిగి పొందవచ్చును.

ఒక లావాదేవీ జరిగినప్పుడు అంతర రాష్ట్రమా లేక వేరే రాష్ట్రములోనా అని నిర్ధారించేవి సరఫరా ఎక్కడ జరిగిందో నిబంధనలు ద్వారా తెలుసుకొనవలసి వుంటుంది.

**5) సరఫరాపై పన్ను :**

జిఎస్‌టి పరిధిలోని అన్ని సరఫరాలకు పన్ను వేయడం జరుగుతుంది. పన్ను లేనివాటికి మరియు పన్ను నుంచి మినహాయించిన వాటికి జిఎస్‌టిలో పన్ను విధించరు.

పన్ను మినహాయింపు కొన్ని వస్తువులకు, కొన్ని సందర్భాలలో లేక కొంతమంది వ్యక్తులకు వర్తింపజేస్తారు.

**6) సరఫరా :** పన్ను పరిధిలోని వ్యక్తి లేక పన్ను కట్టేవ్యక్తి సరఫరా చేస్తాడని జిఎస్‌టిలో విశ్వసించడం జరుగుతుంది. పన్ను పరిధిలోని వ్యక్తి అనగా ఏ వ్యక్తి అంటే భారతదేశంలో కనుక వాణిజ్యం చేస్తూ జిఎస్‌టి చట్టం కింద రిజిస్టర్ కాబడి లేక జిఎస్‌టి చట్టంలోని షెడ్యూలు -3 ప్రకారం రిజిస్టర్ అయిన వ్యక్తి అయివుండాలి. ఏ వ్యక్తి అయినా నిర్ధారించిన అమ్మకం కంటే తక్కువ అమ్మకం జరిపినా లేక ఆ వ్యక్తి చేసే సరఫరాలకు మినహాయింపు వుంటే ఆ వ్యక్తిని పన్ను పరిధిలోని వ్యక్తిగా పరిగణించరు.

**సరఫరాలోని రకములు :**

ఏ) పన్ను పరిధిలోని సరఫరా :

జిఎస్‌టి చట్టం ప్రకారం పన్ను చెల్లించాల్సిన అన్ని సరఫరాలను పన్ను పరిధిలోని సరఫరాలంటారు. పన్ను మినహాయించిన సరఫరాలను, నిల్ రేట్ సరఫరాలను, మినహాయించిన సరఫరాలను, కంపోజిషన్ పరిధిలో నిర్ధారించిన అమ్మకం విలువను నిర్ధారించడంలో కలపడం జరుగుతుంది.

బి) మినహాయింపు సరఫరా :

పన్ను మినహాయింపు ఏ వస్తుసేవల సరఫరాలైనా జిఎస్‌టి ప్రకారం పన్ను కట్టవలసిన అవసరం లేదు. మరియు ప్రభుత్వానికి సెక్షన్-10 ప్రకారం మరిన్ని సరఫరాలను మినహాయించడానికి అధికారం వుంటుంది.

పన్ను మినహాయింపును పూర్తిగా కానీ లేక కొన్ని షరతుల ద్వారాగానీ ఇవ్వడం సెక్షన్-12 ప్రకారం జరుగుతుంది.

సి) జీరో రేటెడ్ సరఫరా :

జీరో రేటెడ్ సరఫరా అనగా జిఎస్‌టి ప్రకారం సరఫరాలకు సున్నా రేటు కట్టవలసివుంటుంది. అంటే పన్ను చెల్లించాల్సి వుండదు. అయితే, వస్తువు యొక్క విలువకు ఇంతకుముందు కట్టిన పన్ను ఇన్‌పుట్ టాక్స్ జమ తీసుకోవడానికి వీలు కలుగుతుంది.

అన్ని ఎగుమతులను జీరో రేటెడ్ సరఫరా కిందకు తీసుకురావడం జరిగింది.

డి) కాంపోజిట్..మిక్స్‌డ్ సప్లైస్ :

కాంపోజిట్ సరఫరా అనగా వ్యాపార నిమిత్తం జరిగే ఏ సరఫరా అయినా ఒకటి లేక రెండు వస్తువులు, ఒకటి లేక రెండు సేవలు లేక వస్తుసేవల కలయికతో కూడినవై వుంటాయి. వాటిని విభజించినా విభజించకపోయినా వాటిని కాంపోజిట్ సరఫరా అంటారు.

ఇ) నిరంతర వస్తు సేవల సరఫరా :

నిరంతర వస్తు సరఫరా అనగా వస్తువులను అందించడానికి అంగీకరించిన లేక అందించడాన్ని నిరంతర సరఫరా అంటారు. నిరంతర సరఫరాకు సరఫరా చేసిన వ్యక్తి సాధారణంగా లేక క్రమాంతరంగా బిల్లును వేయడం జరుగుతుంది.

నిరంతర సేవ సరఫరా అనగా ప్రభుత్వ ప్రకటన ద్వారా కాంట్రాక్టు నిరంతరంగా అందించిన లేక అందించడానికి ఒప్పుకున్నా ఆ సేవలు మూడు నెలలకంటే మించివుండి క్రమాంతరంగా ప్రతిఫలాన్ని ఇవ్వాల్సి వస్తే వాటిని నిరంతర సరఫరా అంటారు.

ఉదా : ఏ అనే వ్యక్తి ఇళ్లు కట్టడానికి సంవత్సర కాలం పడుతుందనుకుంటే, వాటిని పర్యవేక్షించే ఇంజనీర్ సేవలను నిరంతర సేవల సరఫరా కిందికి వస్తుంది.

గల్పిక

# బీజేపీ నేతలకు బీచ్ ఫెస్టివల్ ఆహ్వానం

ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం. బయట హాల్‌లో హైటెక్ రత్న, ఆంధ్రా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు గంటా శ్రీనివాసరావు, పి.నారాయణ, కె.ఇ.కృష్ణమూర్తి, నిమ్మకాయల చినరాజప్ప, దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావులు కూర్చుని వున్నారు. చంద్రబాబు వచ్చిన విషయం పి.ఎస్ ద్వారా తెలుసుకున్న ప్రధాని నరేంద్రమోడీ హాల్‌లోకి వచ్చాడు. వస్తూ వస్తూ తన చేత్తో స్వయంగా తయారు చేసిన 'టీ' తెచ్చి అందరికీ ఇచ్చాడు. అందరూ టీ తాగాక మోడీ వుండి... ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చే పరిస్థితి లేదని చెప్పాం కదా... మళ్లీ దానికోసమే వచ్చారా అని అడిగాడు. చంద్రబాబు టక్కున... అబ్బెబ్బే అలాంటిదేమీ లేదు, నా మైండ్‌లోకి అలాంటి పాడు ఆలోచనలు రావు, మీరు ప్రత్యేకహోదా ఇస్తామన్నా మాకు వద్దంటే వద్దు, మాకు ప్రత్యేకప్యాకేజీయే కావాలి. ఒకవేళ మీరు మొండిగా మా రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామంటే మాత్రం మేం ఎన్డీఏ నుండి తప్పుకోవడమే కాదు, ప్రత్యేకహోదాకు వ్యతిరేకంగా ఆందోళన కూడా చేపట్టావల్సి వస్తుందని హెచ్చరించాడు. మరిప్పుడు ఎందుకోసం వచ్చినట్లని మోడీ అడిగాడు. మేం అధికారంలోకి వచ్చాక నదుల పేర్లు చెప్పి 4వేల కోట్లు తగలేసాం... అదేనండీ... గోదావరి, కృష్ణ పుష్కరాల కోసమని! నదులకు పండుగ చేసినప్పుడు సముద్రుడు చేసిన తప్పేంటి? సముద్రుడి మూలంగా మనం ఎన్ని లక్షల కోట్ల సంపదను అనుభవిస్తున్నాం. ఎన్ని లక్షల కోట్ల వాణిజ్యం చేస్తున్నాం. అలాంటి సముద్రుడికి వెయ్యికోట్లు పెట్టి పండుగ చేస్తే తప్పేంటి. అందుకే ఫిబ్రవరి 14 నుండి 19వ తేదీ వరకు విశాఖపట్నంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నాం. మీరు కూడా తప్పకుండా వచ్చి ఈ ఫెస్టివల్‌లో పాల్గొనాలని ఆహ్వానపత్రిక చేతిలో పెట్టాడు. పసుపు, కుంకుమ పూసి వున్న ఆ కార్డును మోడీ కళ్లకు అద్దుకుని దేవుడి గదివద్ద పెట్టి... ప్రకృతిని ఇంత భక్తితో ఆరాధిస్తున్న మీరు చేస్తున్న ఈ ప్రయత్నం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను, ఈ సాగర పండుగకు హిమాలయాల నుండి నాగసాధువులు, దిగంబర సన్యాసులు కూడా వస్తున్నారా? నేను దిగంబర సన్యాసుల ఆశీస్సులు తీసుకోవాలని అడిగాడు. అందుకు గంటా శ్రీనివాసరావు... ఒక్క హిమాలయాల నుండే కాదు, దేశ విదేశాల నుండి దిగంబర సన్యాసులు వస్తున్నారు. వీళ్లల్లో మహిళలే ఎక్కువ. మీరూ వస్తారు కదా, వచ్చి చూడండి అని చెప్పాడు. అందుకు మోడీ... ప్రపంచ వ్యాప్తంగా వున్న సన్యాసులందరూ వస్తున్నారన్న మాట... ఓకే గోహెడ్... ఈ సాంస్కృతిక ఉత్సవాలకు కేంద్రం నుండి కూడా ఓ వంద కోట్లు మంజూరు చేస్తున్నాను, మన భారతీయ సంస్కృతి ప్రతిబింబించేలా ఈ సాగర పండుగను ఘనంగా చేయండి, ప్రతిరోజూ సాయంత్రం సముద్ర హారతి కూడా పెట్టండని అన్నాడు. గంటా శ్రీనివాసరావు మనసులో... నీ అమాయకత్వం పాడుగాను... మీరంతా ఎప్పుడూ ఇలాగే వుంటారా... మిమ్మల్ని ఎక్కడికో తీసుకెళ్లాలని మేమనుకుంటాం, మీరిక్కడే వుంటారు, అక్కడకు రారు అని అనుకున్నాడు. చంద్రబాబు బృందం మోడీ వద్ద సెలవు తీసుకుని కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, మనోహర్ పారికర్, అరుణ్‌జైట్లీ, సురేష్‌ప్రభు, అనంతకుమార్‌లను కూడా ఆహ్వానించి వెంకయ్యనాయుడు ఇంటికెళ్లింది. చంద్రబాబు బీచ్ ఫెస్టివల్‌కు ఆహ్వానించగానే వెంకయ్య... శెభాష్ చంద్రబాబు, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడడంలో మాకంటే నువ్వే ఎక్కువ కష్టపడుతున్నావ్, ఇలాంటి ప్రోగ్రామ్‌లు చేయడంలో ఈవెంట్ మేనేజర్లు కూడా నీ ముందు పనికిరారు. విశాఖపట్నంలో జరిగే బంగాళాఖాతం సముద్ర పండుగ విజయవంతమైతే, తర్వాత హిందూమహాసముద్రం, అరేబియా సముద్రం ఫెస్టివల్ కాంట్రాక్ట్ కూడా నీకే ఇప్పిస్తాను, ఫెస్టివల్‌లో ఎప్పుడూ భక్తిగీతాలు, గాయత్రి మంత్రాలు, గణేశుని శ్లోకాలు, వేంకటేశ్వర సుప్రభాతం వినిపించేలా ఏర్పాట్లు చేయండి, విశాఖతీరం మొత్తం భక్తి వాతావరణం ఉట్టిపడాలి అని చెప్పాడు. చంద్రబాబు వుండి... అంతా లోకేష్ ఆధ్వర్యంలో జరుగుతుంది, ఫెస్టివల్స్ నిర్వహణలో ఎక్స్‌పర్ట్, ఏ లోటూ రానివ్వడని అన్నాడు. వెంకయ్య అందుకు... లోకేష్‌కు చిన్నవయసులోనే ఇంత భక్తిభావమా... వెరీగుడ్... బెస్టాఫ్‌లక్... బాగా చేయండి అని చెప్పాడు. చంద్ర బాబు బృందం మిగతావారికి ఆహ్వానపత్రికలు ఇవ్వడానికి అక్కడనుండి కదిలింది. వాళ్లు నేరుగా బీజేపీ సీనియర్ నేత అద్వానీ ఇంటికి వెళ్లారు. చంద్రబాబు ఆయనకు బీచ్‌ఫెస్టివల్ ఆహ్వానపత్రికను అందించి... విశాఖ బీచ్ ఫెస్టివల్‌కు మీరు తప్పకుండా రావాలన్నాడు. అద్వానీ అందుకు.. నా భార్యా పిల్లలతో కలసి వస్తానన్నాడు. వెంటనే పి.నారాయణ... సార్, వాళ్లందరూ పల్లేదు, మీరొక్కరొచ్చి ఆనందిస్తే చాలు అని అన్నాడు. దానికి అద్వానీ... ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నేను కుటుంబసభ్యులతో కలిసే హాజరవు తుంటాను, మనం చేసే కార్యక్రమాలలో వాళ్లకూ పుణ్యం దక్కాలిగా, ఈ పండుగకు కంచి నుండి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి వస్తున్నారా అని ప్రశ్నించాడు. వెంటనే గంటా శ్రీనివాసరావు... ఆయన సంగతేమో తెలియదుగాని ఫ్రెంచ్ నుండి దాష్‌దయానా వస్తుందన్నాడు. అద్వానీ అందుకు... ఆ స్వామి ఎవరో నాకు తెలియదు గాని శృంగేరి పీఠం నుండి శంకరానందస్వామి వస్తున్నారా అని ప్రశ్నించాడు. ఈసారి నారాయణ వుండి... ఆయన గురించి తెలియదు గాని హంగేరి నుండి మిస్ ఫెమిలామేరీ వస్తుందన్నాడు. ఈ హంగేరి బాబా ఎవరో నాకు తెలియదు గాని, శ్రీ పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద వస్తున్నారా? అని మళ్లీ అద్వానీ అడిగాడు. దానికి పత్తిపాటి... ఆయన రాకపై సమాచారం లేదు గాని సింగపూర్ నుండి మోడల్ పెంగ్‌వింగ్ వస్తుందన్నాడు. బెంగుళూరు నుండి పండిట్ రవిశంకర్ గురూజీ వస్తున్నారా? అని అద్వానీ ప్రశ్నించాడు. దానికి దేవినేని ఉమ... మంగళూరు నుండి మిస్ నీలిమా నిలబడే వస్తుందని అన్నాడు. వాళ్లు చెప్పిన పేర్లను విన్న అద్వానీ.. వీళ్లంతా ఎవరో కొత్త స్వాముల్లాగా వున్నారు. వీళ్ల పేర్లను కూడా నేనెప్పుడూ వినలేదు. ఇది అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లున్నారు, అందుకే అన్ని దేశాల మఠాధిపతులను ఆహ్వానించినట్లున్నారని మనసులో అనుకుని... ఈ పండుగకు నేను తప్పకుండా వస్తాను. ఈ పండుగ శుభప్రదంగా జరగాలని ఆ దేవుడిని కోరుకుంటున్నాను అని చెప్పాడు. చంద్రబాబు టీమ్... మీ ఆశీస్సులుంటే చాలు... ఫెస్టివల్‌ను అదరగొట్టేస్తాం అంటూ అక్కడ నుండి లేచింది.

**(...ఇంకా వుంది)**

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆదాయవృద్ధికి చేసే ప్రయత్నాలు సరిగా ఫలించవు. వ్యాపారములందు ఇబ్బందులు పడవలసి రావచ్చును. వృత్తి పరంగా జీవనంలో రాబడి అభివృద్ధి ఉంటుంది. సరైన నిర్ణయాలు చేయలేక ఇబ్బందులు పడతారు. అనుకున్న పనులను ధైర్యంగా నిర్వహించండి. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగి శ్రమపడతారు. పెరిగే ఖర్చులను అదుపు చేయలేరు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

అదనపు ఖర్చులుండినా ఆర్థిక ఇబ్బందులు కలిగించకపోవచ్చును. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులను సామరస్యంగా పరిష్కరించుకొనండి. లౌక్యంగా సర్దుకొని పోండి. శుభకార్యాలు నిర్ణయాలు కాగలవు. విదేశ ప్రయాణాలకు అవకాశాలు దొరుకుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగులకు గుర్తింపుగౌరవాలుంటాయి.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకున్న పనులను సమర్థవంతంగా నిర్వహిస్తారు. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు లభించగలవు. కొత్త కాంట్రాక్టులు, పెట్టుబడి అవకాశాలు బాగుంటాయి. వాహనాలు నడిపేటప్పుడు, యంత్రాలు కరెంటు పనులందు జాగ్రత్త అవసరం. అనుకోని ప్రయాణాలుంటాయి. వ్యాపారవర్గాలకు అవకాశాలు చేజారిపోవచ్చును. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థికంగా బాగుండి వృత్తి వ్యాపారాలు వేగం అందుకుంటాయి. ఆదాయం పెరుగుతుంది. కాని ఖర్చులు కూడా పెరిగే అవకాశం ఉంది కాబట్టి అదుపు చేయండి. తొందరపడి పనులు చేయడం, తొందరపడి మాట్లాడడం చేయవద్దు. చేపట్టిన పనులలో కొంత ఆటంకాలుంటాయి. బంధువర్గంలో శుభకార్య నిర్ణయాలు కాగలవు. నోటీసులు, ముఖ్య కాగితాలు అందుకుంటారు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

చేస్తున్న పనులందు టెన్షన్ ఎక్కువగానుండును. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుంటుంది. ఆదాయం సంతృప్తికరం. ఒక ముఖ్య కార్యక్రమానికి ఆర్థిక సహాయం చేస్తారు. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. ప్రభుత్వ అనుమతులు బ్యాంకు ఋణాలు లభించగలవు. నిర్మాణాలు చేసేవారికి వర్కర్ల సమస్యలుంటాయి. శుభ కార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కార్యక్రమాలను, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. పొదుపు పథకాలలో అవకాశం వస్తుంది. ప్రముఖులతో పరిచయాలు ప్రయోజనాన్ని కలిగిస్తాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. వైద్య సాంకేతిక రంగాల వారికి ఆదాయం, గుర్తింపు బాగుంటుంది. తొందరపాటు ప్రవర్తన తగ్గించుకొనాలి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 11.11.2016 నుండి
తేది. 17.11.2016 వరకు

ఈ వారము మీనమేషవృషభరాశులలో చంద్రుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, తులలో రవి మరియు 16తేది నుండి వృశ్చికంలో రవి, వృశ్చికంలో శనిబుధులు, ధనుస్సులో శుక్రుడు, మకరంలో కుజుడు, కుంభంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము**

తేది 11 శుక్రవారము చిలుక ద్వాదశి పర్వదినము
తేది 14 సోమవారము కార్తీకపూర్ణిమ

**ముహూర్తములు:**

తేది 13 ఆదివారము ఉ॥ గం. 9.0 నుండి 11.0లోగా వివాహ వ్యాపారములకు ధనుర్లగ్నము. తేది 16 బుధవారము ఉ॥ 9.0 నుండి 10.53లోగా వివాహ వ్యాపార గృహారంభములకు ధనుర్లగ్నము. రాత్రి 2.0 నుండి 4.0 లోగా గృహప్రవేశ వివాహములకు కన్యాలగ్నము. తేది17 గురువారము ఉ॥ 8.40 నుండి 10.40లోగా వివాహ వ్యాపార గృహారంభములకు ధనుర్లగ్నము.

**కార్తీక మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 11 | శుక్ర | ద్వాదశి | రా॥ గం.2.36వ॥ |
| తేది. 12 | శని | త్రయోదశి | రా॥ గం.12.30వ॥ |
| తేది. 13 | ఆది | చతుర్దశి | రా॥ గం.10.14వ॥ |
| తేది. 14 | సోమ | పూర్ణిమ | రా॥ గం.7.51వ॥ |

**కార్తీక మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 15 | మంగళ | పాడ్యమి | సా॥ గం.5.28వ॥ |
| తేది. 16 | బుధ | విదియ | సా॥ గం.3.10వ॥ |
| తేది. 17 | గురు | తదియ | ప॥ గం.1.00వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అనుకున్న పనులు వేగంగా జరుగుతాయి మరియు సమర్థవంతంగా నిర్వహిస్తారు. దీర్ఘకాలిక ప్రయోజనాలతో నిర్ణయాలు చేయండి. కొత్త వ్యాపారాలకు, పెట్టుబడులకు అవకాశాలు లాభిస్తాయి. ప్రభుత్వ అనుమతులు, అధికారవర్గాలందు పరపతి బాగుంటుంది. వృత్తుల వారికి వ్యాపారులకు పురోభివృద్ధి బాగుంటుంది. స్థిరాస్తులు సమకూర్చుకొనే ప్రయత్నాలుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఇంటా బయటా వ్యవహారాలలో, ముఖ్యంగా ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండండి. పనులు నిదానంగా జరుగుతాయి. ముఖప్రీతి మాటలకు లొంగడం, ఋణాలివ్వడంలో తొందరపడవద్దు. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. బిడ్డలకు ఉద్యోగ, వివాహ ప్రయత్నాలు ఫలించగలవు. రావలసిన బాకీలు కొంత మేరకు అందుతాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థిక ఇబ్బందులుంటాయి. ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారవర్గాలకు పోటీ వల్ల అవకాశాలు తగ్గుతాయి. వృత్తి జీవనం కలవారికి బాగుంటుంది. అనుకున్న పనులను ఆటంకాలుండినా, ఏదో ఒక విధంగా జరుపుకొంటారు. బంధువర్గంతో విభేదాలు రాకుండా జాగ్రత్తపడండి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ప్రముఖుల పరిచయాలుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థిక ఇబ్బందులను క్రమంగా అధిగమిస్తారు. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. సరైన అవగాహన, ఆలోచనలతో పనులు జరుపుతారు. ప్రభుత్వ అనుమతులు, కొత్త కాంట్రాక్టులు, కొత్త పెట్టుబడి అవకాశాలు దొరుకుతాయి. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుండవచ్చును. వస్తు వాహన గృహ రిపేర్ల ఖర్చులుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఇంటా బయటా వ్యవహారాలను లౌక్యంగా నిర్వహించండి. కుటుంబంలో స్వల్ప విభేదాలు చోటుచేసికొనవచ్చును. ఆర్థిక స్థితి బాగుండి వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. కొత్త నిర్మాణాలు, వ్యాపారాలు చేపట్టుతారు. బంధుమిత్రుల ఆదరణ, ఉద్యోగుల సమర్థతకు గుర్తింపు ప్రతిఫలం లభిస్తుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఆరోగ్యం జాగ్రత్త.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వ్యవహారాలను సమర్థవంతంగా నడుపుతారు. ఆర్థిక స్థితి బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. ఆత్మీయులను ప్రముఖులను కలుసుకొంటారు. శాస్త్ర వైద్య క్రీడా కళా సాంకేతిక రంగాలవారికి అవకాశాలు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. విద్యార్థులకు విద్యా ప్రగతి బాగుంది. శుభకార్యాలు ఫలించడం, సమావేశాలు, దైవ కార్యాలలో పాల్గొనడం జరుగుతుంది.

# కళ్యాణ వైభవం...!



హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో కమర్షియల్ డైరెక్టర్‌గా, అనంతరం నెల్లూరు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ జనరల్ మేనేజర్‌గానే కాక, హైదరాబాద్ మాదాపూర్‌లో విజయవంతంగా నిర్వహింపబడుతున్న "కృష్ణాస్ కిచెన్" వ్యవస్థాపకుడిగా అందరికీ సుపరిచితుడు, మాజీ గవర్నర్ కె.వి.రఘునాధరెడ్డికి స్వయానా మేనల్లుడు, ఇటీవలే కీర్తిశేషుడైన మన్నం కృష్ణమోహన్‌రెడ్డి - శ్రీమతి మనోరమల కుమార్తె **శ్రీవర్ష - అవినాష్** (శ్రీమతి నివేదిత - అపూర్వ చంద్రారెడ్డిల కుమారుడు)ల వివాహం నవంబర్ 2వ తేదీ ఉదయం శ్రీవర్ష సోదరుడు శ్రీహర్ష సారధ్యంలో ఘనంగా జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభదీవెనెలు.



భిక్షాటనా పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ శాశ్వత కార్యదర్శి డాక్టర్ యనమండ్ర నాగదేవీప్రసాద్ - లక్ష్మీశైలజల కుమారుడు **చెన్నకేశవ వెంకట చైతన్య కుమార్ - వైష్ణవి** (నెల్లూరు వాస్తవ్యులు యద్దనపూడి ధనుంజయశర్మ - అరుణకుమారిల కుమార్తె)ల కళ్యాణం ఈ నెల 9వ తేదీ జిపిఆర్ గ్రాండ్ కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



పున్నమి దినపత్రిక ఎడిటర్ సర్వేపల్లి కోటేశ్వరరావు - విజయలక్ష్మిల కుమార్తె **డా॥ లక్ష్మీకీర్తి - డా॥ సాయితేజ** (నెల్లూరు వాస్తవ్యులు గంగపట్నం శివకుమార్ - హైమావతిల కుమారుడు)ల పెళ్లి ఈ నెల 9వ తేదీ నెల్లూరులోని ఏఎన్ఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

### చిన్నపిల్లల మానసిక సమస్యలపై...

# 13న ఉచిత వైద్య శిబిరం



- డా॥ టి.రవికుమార్

ఆధునిక సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్న పోటీతత్వం వల్ల స్కూలు విద్యార్థుల్లో అనేక రకాల మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని, ఆ సమస్యలకు మొట్టమొదటిసారిగా ఈ నెల 13వ తేదీ ఆదివారం నెల్లూరు పొగతోటలోని రిచ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత చెకప్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు రిచ్ హాస్పిటల్ ఛైర్మెన్ డా॥ టి.రవికుమార్ పేర్కొన్నారు. గురువారం తమ హాస్పిటల్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మానసిక సమస్యలు కలిగిన పిల్లల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, అమెరికాలో శిక్షణ పొందిన ప్రముఖ సైకియాట్రిస్ట్ డా॥ శివప్రకాశం ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చిన్న పిల్లల మానసిక సమస్యలు, ఎదుగుదల సమస్యలు, స్కూల్ పెర్ఫార్మెన్స్, ఎబిలిటి తదితర సమస్యలను చూసి కౌన్సిలింగ్ ఇవ్వబడుతుందన్నారు. మెట్రోపాలిటన్ సిటీలలో మాత్రమే అందుబాటులో వుండే "మాలిన్స్ ఇంటెలిజెన్స్ టెస్ట్", మెమెరీ టెస్ట్‌లు, చైల్డ్ అడ్జస్ట్‌మెంట్ టెస్ట్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ బిడ్డను తీసుకువచ్చి పరీక్షించుకుని, తమ పిల్లలను మానసికంగా దృఢంగా చేసుకోవాలని కోరారు.



## కావలి కబుర్లు

# జగన్‌కు ప్రతిపక్ష నేత స్థాయి లేదు

### - దేశం పొలిట్ భ్యూరో సభ్యుడు సోమిరెడ్డి



దేశ చరిత్రలో 11కేసులలో మెదటి ముద్దాయిగా నిలిచి ఒక రాజకీయ పార్టీకి అధ్యక్షుడుగా ఉన్న ఏకైక వ్యక్తి వైయస్ జగన్‌మెహన్ రెడ్డి ఒక్కడేనని, అటువంటి వ్యక్తికి పాలనా ధక్షుడు చంద్రబాబును విమర్శించే అర్హత లేదని తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. దేశం సీనియర్ నాయకులు కేతిరెడ్డి రామకోటారెడ్డి నివాసంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. విశాఖపట్టణంలో వైయస్ జగన్ జై ఆంధ్ర ప్రదేశ్ సభలో చంద్రబాబు పై చేసిన విమర్శలను సోమిరెడ్డి తీవ్రంగా ఖండించారు. తండ్రి అదికారాన్ని అడ్డంపెట్టుకొని రాష్ట్రాన్ని దోచుకొని కోట్లుదాచుకున్న జగన్ అవినీతి రహిత పాలకుడు చంద్రబాబు పై టాడా యాక్ట్ పెట్టాలని కోరడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. అసలు టాడా యాక్ట్ అంటే ఏమిటో నీకు తెలుసా అని జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. దేశద్రోహులపైనా ఉగ్రవాదులపైనా పెట్టే టాడా యాక్ట్ ప్రజానేత చంద్రబాబు పై పెట్టాలనడం జగన్ అజ్ఞానాన్ని సూచిస్తుందని సోమిరెడ్డి ఎద్దేవా చేసారు. ఇటువంటి వ్యక్తిని ప్రతిపక్ష నేతగా భరించడం తెలుగు వారికి పట్టిన దుర్గతి అని అన్నారు . దేశ ద్రోహానికి పాల్పడిన నీపై టాడా యాక్ట్ మెదట పెట్టాలని ఇది గుర్తించి అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు . పుట్టుకతోనే స్థితిమంత్తురాలైన నారా భువనేశ్వరి ఆధ్వర్యంలోని హేరిటేజ్ గురించి మాట్లాడే నైతిక హక్కు నీకు ఉన్నదా? అని జగన్‌ను సోమిరెడ్డి ప్రశ్నించారు. ముందుగా సోమిరెడ్డి పట్టణంలో జరిగిన 9వవార్డు జనచైతన్య యాత్రలో బాగంగా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. పాత శివాలయంలో ఆయనకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వార్డులో పర్యటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు ఎరిక్షిన్ బాబు, పట్టణ అధ్యక్షులు మల్లిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు గ్రంది యానాదిశెట్టి, గుత్తికొండ కిషోర్, 9 వార్డు కౌన్సిలర్ శివకుమార్, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు .

# మత్స్యకారులకు సైకిళ్లు, వలలు పంపిణీ



ఎస్టీ కులానికి చెందిన 30మంది మత్యకారులకు చేపలు పట్టే వలలను, సైకిళ్ళను ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి మత్యశాఖ కార్యలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్బంగా మత్స్యకారులు మాట్లాడుతూ కొత్తపల్లికి చెందిన ఎస్టీ కులానికి చెందిన 30మత్యకారులకు చేపలు వేటకు వెల్లేందుకు వలలను,సైకిళ్లు కావాలని గత 10 నెలల క్రితం మత్యశాఖ జెడికి అప్లై చేసుకున్నామని ఎన్ని సార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన పలుదఫాలు జేడి తో మాట్లాడి అనేక సందర్భాలలో జెడ్పీ సమావేశాలలో మాట్లాడి మాకు సైకిళ్లను, వలలను ఇప్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు .అనంతరం ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పేదవారికి సబ్సిడీ కింద ఇవ్వాల్సినవి కూడా ఇవ్వకుండా తిప్పుకోవడం బాగాలేదని ప్రభుత్వం మంజూరు చేసినవి వెంటనే లబ్దిదారులకు అందజేయాలని అదికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో పట్టణ అద్యక్షులు శివకుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధి కామరాజు, నాయకులు జగదీశ్వరరెడ్డి, సుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జనచైతన్య యాత్రకు విశేష స్పందన



పట్టణంలో జరుగుతున్న జన చైతన్య యాత్రలకు విశేష స్పందన లభిస్తుందని పట్టణ అద్యక్షులు మల్లిశెట్టి వెంకటేశ్వర్లు తెలియజేసారు. పట్టణంలోని 10, 11, 12వార్డులలో ఆయా వార్డుల అద్యక్షులు జ్యోతి బాబురావు, మైనంపాటి ఏసురత్నం, నూకవరపు సూర్యప్రకాశరావు, మేడికొండ సుకుమార్ ఆధ్వర్యంలో జనచైతన్య యాత్రలు నిర్వహించారు. ఈ యాత్రలో పాల్గొన్న పట్టణఅద్యక్షులు మల్లిశెట్టి వెంకటేశ్వర్లు పార్టీ జెండాను ఆవిష్కరించి ఆయా వార్డులలో జనచైతన్య యాత్రలను ప్రారంభించారు. అనంతరం ఆయన, మాట్లాడుతూ లోటు బడ్జెట్ లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అబివృద్ధి పధంలో నడిపించగల నాయుకుడు చంద్రబాబు అని అలానే రైతుల ఋణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ చేసి అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అని అన్నారు. అనంతరం వార్డులలో ఇంటింటికి తిరిగి గత రెండున్నర సంవత్సరంలో జరిగిన అబివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్క తెలుగుదేశం కార్యకర్త సభ్యత్వం నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం తెలుగుదేశ పార్టీ కార్యకర్తలచే సభ్యత్వాలను నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి అమరా వేదగిరి, నాయకులు గుంట్టుపల్లి రాజకుమార్ చౌదరి, తిరివీధి ప్రసాద్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు పునరావాసం కల్పించండి



పేదలకు పునరావాసం కల్పించిన తర్వాత ఇళ్ల తొలగింపును చేపట్టాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం 53వ డివిజన్ సాలుచింతలలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ నాలుగు లైన్ల రోడ్డు మంజూరు కారణంగా ఇళ్లను తొలగించాలని నోటీసులు జారీ చేశారని, నగరానికి సంబంధించిన 67ఇళ్లు, పోతిరెడ్డిపాలెం పంచాయితికి సంబంధించి 150ఇళ్లను తొలగించేందుకు నోటీసులు జారీ చేశారన్నారు. పోతిరెడ్డిపాలెం పరిధిలోని వారికి కోవూరు పంచాయితీకి సంబంధించిన స్థలాల్లో ఇళ్లు ఇస్తారని చెప్పారని, నగరానికి సంబంధించిన వారికి ఎక్కడ పునరావాసం కల్పిస్తారో తెలియక ప్రజలు ఆందోళనకు గురౌతున్నారన్నారు. పాలిటెక్నిక్ కళాశాల వద్ద ప్రభుత్వానికి సంబంధించిన ఆరేడు ఎకరాల స్థలం ఉందని, అధికారులు ఇక్కడి స్థలాన్ని సర్వే చేయించి వీరికి కేటాయించాలన్నారు. కార్పొరేటర్లు దేవరకొండ అశోక్, ఓబిలి రవిచంద్ర, నాయకులు నాగసుబ్బారెడ్డి, నాగభూషణం, భీముడు, నాగరాజు, హరి, జాకీర్, ఉస్మేరా, సుభాషిణి పాల్గొన్నారు.

# ఎంతైనా డిపాజిట్ చేసుకోవచ్చు



మాట్లాడుతున్న డిఎస్పీ శ్రీనివాస్, ప్రక్కన ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ మురళీకృష్ణ

గూడూరు పట్టణంలోని అన్ని బ్యాంకుల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహిస్తామని డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ అన్నారు. గూడూరు డిఎస్పీ కార్యాలయంలో బుధవారం పట్టణంలోని బ్యాంకు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ మురళీకృష్ణ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులు ఎంతైనా డిపాజిట్ చేసుకోవచ్చునని, ఆర్‌బిఐ ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీ వరకు వ్యక్తిగత ఖాతాల నుంచి రోజుకు రూ.10వేలు, వారానికి రూ.20వేలు మాత్రమే విత్‌డ్రా చేసుకోవచ్చున్నారు. ఏటిఎంలో ఈ నెల 18వ తేదీ వరకు రోజుకు 2వేలు చొప్పున, ఈ నెల 19వ తేదీ నుంచి 24వరకు గరిష్టంగా రూ.4వేలు మాత్రమే డ్రా చేసుకోవాలని సూచించారు. 24వ తేదీ అనంతరం ఆర్‌బిఐ ఆదేశాలు వెలువడిన అనంతరం తదనుగుణంగా బ్యాంకు సేవలు అందిస్తామన్నారు. రూ.500, 1000నోట్లను డిసెంబర్ నెలాఖరులోగా బ్యాంకు ఖాతాల్లో వేసుకోవచ్చునని చెప్పారు. గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకు మేనేజర్లు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవగాహన సదస్సు



ప్రముఖ ఎన్ఎల్‌పి ట్రైనర్, వ్యక్తిత్వ వికాస తరగతుల నిపుణులు కర్లపూడి కృష్ణయ్యచే ఈ నెల 5వ తేదీన 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు రెండురోజుల అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు చదవడానికి, మెళకువలు, జ్ఞాపకశక్తి పెంపొందించుకొనేందుకు, వ్యక్తిత్వము అభివృద్ధి చేసుకోవడానికి ప్రతి 3 నెలలకు ఒకసారి న్యూరో లింగిస్టిక్(ఎన్ఎల్‌పి) ప్రోగ్రామ్‌లు జరుగుతాయని కృష్ణయ్య పేర్కొన్నారు. చదువుపై ఏకాగ్రత ఎలా పెంచుకోవాలి, మంచి ఆహార అలవాట్లు, నిద్రించే అలవాట్లు, బుద్ధి వికాసము, కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి వంటి అంశాలపై కృష్ణయ్య అవగాహన కల్పించారు. విద్యార్థులు విద్యలో రాణించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని సంస్థ అధ్యక్షురాలు వేదవతి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, డైరెక్టర్ నరేంద్రరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ డి.వాణి, హెడ్‌మాస్టర్ ఎస్.వి.ఎల్.నరశింహరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గుండెకు అరుదైన ఆపరేషన్

నెల్లూరు సింహపురి హాస్పిటల్లో గుండెకు అరుదైన హైబ్రిడ్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ప్రముఖ గుండె వైద్య నిపుణులు చిర్రా భక్తవత్సల రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరుజిల్లా సంగం మండలం దువ్వూరుకు చెందిన 14ఏళ్ల నరేష్‌కు పుట్టుకతోనే గుండెకు మూడు రంధ్రాలు ఉన్నాయని, దీంతో గుండెకు సరఫరా అయ్యే మంచి రక్తం, చెడు రక్తం కలిసిపోయి కాళ్లు, చేతులు నీలంగా మారిపోతూ ఆయాసంతో బాధపడుతూ చికిత్స కోసం తమ వద్దకు వచ్చాడని, ఈ క్రమంలో అమెరికా, యూరప్‌లో నిర్వహించే హైబ్రిడ్ శస్త్ర చికిత్సను తొలిసారిగా సింహపురిలో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆపరేషన్ అనంతరం ఐదురోజులకే రోగి కోలుకున్నాడని తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవలో ఉచిత చికిత్సను అందించినట్లు తెలిపారు. డాక్టర్ షర్మిలి, శ్రీకాంత్, కార్డియాలజి సర్జన్ నాగరాజ్, కార్డియాక్ అనస్థటిస్ట్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బ్లాక్‌కు షాక్

(మొదటి పేజీ తరువాయి)

సర్జికల్ స్ట్రైక్‌తో పాకిస్థాన్‌కు షాకిచ్చిన ప్రధాని నరేంద్రమోడీ, సీమాంతర ఉగ్రవాదంపైనే కాదు, స్వదేశీ ఆర్థిక ఉగ్రవాదంపై కూడా సర్జికల్ స్ట్రైక్ చేయగలనని నిరూపించాడు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ ప్రధాని కూడా తీసుకోలేనంతగా సాహసోపేత నిర్ణయం తీసుకుని దేశంలో చెలామణి అవుతున్న వెయ్యి, ఐదొందల రూపాయల నోట్లను రద్దు చేయడం దేశవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ నెల 8వ తేదీ రాత్రి సమయంలో ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాని చాలా కూల్‌గా ఈ రెండు పెద్ద నోట్లు రద్దు చేస్తున్న విషయం చెప్పగా, ఆ వార్త దేశవ్యాప్తంగా బ్లాక్‌బస్టర్ అయ్యింది. ముఖ్యంగా బ్లాక్‌మనీ కింగ్‌ల గుండెలు బద్ధలయ్యాయి. నల్ల కుబేరుల పాలిట ఇది పిడుగులాంటి వార్తయ్యింది. నిజంగా ఇది పెద్ద షాకే! అది కూడా అప్పటికప్పుడు అమల్లోకి వచ్చేయడం నల్లధనం అదుపు పట్ల మోడీకున్న పట్టుదలకు నిదర్శనంగా కనిపిస్తోంది. రద్దు చేసిన వెయ్యి, 500నోట్ల స్థానంలో కొత్తగా రూపొందించిన 500, 2000 రూపాయల నోట్లు ప్రవేశపెట్టారు.

## ప్రధాన లక్ష్యం నల్లధనం, నకిలీ కరెన్సీ!

ప్రధాని నరేంద్రమోడీ ఈ రెండు పెద్ద నోట్లను రద్దు చేసే ఆపరేషన్‌ను చాలా రహస్యంగా నిర్వహించినట్లు తెలుస్తోంది. ప్రధాని, ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్, ప్రధాని ఆర్థిక సలహాదారులు ఇందులో ప్రధానపాత్రదారులు. మిగతా మంత్రివర్గ సహచరులకు కూడా ఈ విషయం తెలియనీయలేదు. మంత్రులకు తెలుసుంటే కొందరి ద్వారానన్నా మీడియాకు లీకయ్యేది. నల్లకుబేరులు అప్రమత్తం కాకుండా చావుకబురు చల్లగాచెప్పారు. ఈ రెండు నోట్ల రద్దు వెనుక లక్ష్యం నల్లధనాన్ని అరికట్టడంతో పాటు నకిలీ కరెన్సీని అదుపు చేయడం. దేశంలో చాలామంది నల్లకుబేరుల వద్ద నల్లధనం కట్టలకొద్ది కోట్లలో మూలుగుతోంది. వీరిలో పారిశ్రామికవేత్తలు, వడ్డీ వ్యాపారులు, రాజకీయ నాయకులు కూడా వున్నారు. ఇటీవల ఇలాంటివారి కోసమే కేంద్రం బిడిఎస్ పేరుతో ఒక స్కీంను కూడా ప్రవేశపెట్టింది. పన్ను, అపరాధ రుసుం క్రింద 45శాతం డబ్బు చెల్లించి నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోమని సెప్టెంబర్ 30 దాకా గడువిచ్చింది. అయితే దీనికి స్పందన చాలా తక్కువగానే వుండింది. కేవలం 70వేల కోట్లు మాత్రం నల్లధనం రూపేణ వచ్చింది. నల్లకుబేరులకు కేంద్రం ఇచ్చిన అవకాశం అక్కడితో అయిపోయింది. పన్ను కట్టిన వారు సరే... ఇంకా నల్లధనం బయటపెట్టని వారి సంగతేంటి... ఇక్కడే మోడీ కొరడా ఝుళిపించాడు. రెండు పెద్దనోట్లను రద్దు చేయడంతో టాక్స్ కట్టకుండా నోట్ల కట్టలు ఇళ్లల్లో, రహస్య స్థావరాల్లో పెట్టుకున్నవాళ్లను గురిచూసి కొట్టాడు. వాళ్ల దగ్గరున్న వేలకోట్ల డబ్బుకు ఒక్క నిముషంలో ఎలాంటి విలువ లేకుండా చేశాడు. ఇక కొత్తగా విడుదల చేసే కరెన్సీ అంతా కూడా బ్యాంకుల ద్వారానే లావాదేవీలు జరుగుతాయి. కాబట్టి నల్లధనం చాలావరకు తగ్గిపోతుంది. ఇక మరో ముఖ్య అంశం నకిలీ కరెన్సీ! దేశంలో నకిలీ వెయ్యి, 500 నోట్లు విచ్చలవిడిగా వున్నాయి. ఈ నకిలీ కరెన్సీ ముద్రణకు పాకిస్థానే కేంద్రం. ఈ నకిలీ కరెన్సీని మన దేశంలోనే చెలామణి చేస్తూ మన ఆర్థిక వ్యవస్థను పరోక్షంగా దెబ్బతీయడానికి పాకిస్థాన్ కుట్ర పన్నుతోంది. ఈ పాతనోట్ల రద్దుతో నకిలీ కరెన్సీ కూడా నిర్వీర్యమైపోతుంది. నకిలీ కరెన్సీని తయారు చేయలేనంత సాంకేతిక పరిజ్ఞానంతో కేంద్రం కొత్త నోట్లను తయారు చేస్తోంది.

## సామాన్యులకు తాత్కాలిక ఇబ్బంది...

దాదాపు 7దశాబ్దాలుగా దేశ ప్రజలు ఒకే విధమైన ఆర్థిక లావాదేవీలకు అలవాటు పడివున్నారు. మన లావాదేవీలన్నీ కూడా చాలా వరకు కరెన్సీ రూపంలోనే వుంటాయి. ఈ లావాదేవీలలో నల్లడబ్బే ప్రధాన పాత్ర పోషిస్తుంది. తెలిసో తెలియకో ప్రజలు కూడా నల్లధనం లావాదేవీలలో పాత్రధారులవుతున్నారు. ఉదాహరణకు మనం ఒక స్థలాన్ని 10లక్షల రూపాయలకు కొంటే, ప్రభుత్వ విలువ లక్ష రూపాయలుగా రిజిష్టర్ చేసుకుంటున్నాం. మిగతా 9లక్షలు నల్లధనమే! దేశంనిండా ప్రతిరోజూ ఇలాంటి నల్లధనం లావాదేవీలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. ఇవన్నీ కూడా సక్రమంగా జరిగి, ప్రజలు న్యాయబద్ధంగా ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు చెల్లిస్తే ప్రపంచంలో మన దేశాన్ని మించిన ఆర్థిక వ్యవస్థ ఉండదు. కాబట్టి దేశం కోసం ప్రజలు ఈ తాత్కాలిక అగచాట్లను భరించక తప్పదు. పెద్దనోట్లను రద్దు చేస్తున్నట్లు 8వ తేదీ రాత్రి ప్రధాని ప్రకటించిన మరుక్షణమే ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. ఇప్పుడు చెలామణిలో ఎక్కువుగా వున్నది పెద్దనోట్లే! వెయ్యి, ఐదొందల నోట్లు ఇస్తుంటే షాపులు, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలలో తీసుకోలేదు. దీంతో చిన్న నోట్లు లేక, వస్తువులు కొనలేక సామాన్యులు సమస్యలు ఎదుర్కొన్నారు. బ్యాంకుల నుండి తగినంత నగదు డ్రా చేసుకునే అవకాశాలు అప్పుడే లేకపోవడంతో ఇంకొద్ది రోజులు ఈ ఇబ్బంది తప్పదు. అయినా దేశం కోసం ఇది భరించక తప్పదు.

## రాజన్‌ను సాగనంపింది అందుకేనా?

యూపిఏ ప్రభుత్వంలో ఆర్‌బిఐ గవర్నర్‌గా నియమించబడ్డ రఘురామరాజన్ పోకడలు మోడీకి నచ్చలేదు. ఆర్థికపరంగా కొన్ని సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడంలో మోడీకి ఆయన సహకరించలేదు. అందుకే ఎన్ని ఒత్తిడిలు వచ్చినా రాజన్‌ను రెండోసారి గవర్నర్‌గా నియమించడానికి మోడీ ఇష్టపడలేదు. అదీగాక రాజన్ అమెరికన్ సిటిజన్. ఇండియన్ సిటిజన్‌షిప్ తీసుకోవడానికి కూడా ఆయన ఇష్టపడలేదు. ఈ కారణంతోనే ఆయనను సాగనంపి, తనకు అనుకూలమైన, తన రాష్ట్రానికే చెందిన ఉర్జిత్ పటేల్‌ను ఆర్‌బిఐ గవర్నర్‌గా నియమించారు.

## రాజకీయ పక్షాల మిశ్రమ స్పందన

పెద్దనోట్ల రద్దుపై దేశంలోని రాజకీయ పక్షాలు తలోరకంగా స్పందించాయి. ఇంతకాలం నల్ల కుబేరులకు కల్పవృక్షంగా వున్న కాంగ్రెస్ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. వామపక్షాలు ఈ నిర్ణయంతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడతారని బాధపడ్డాయి. వేలకోట్లు సంపాదించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపిలోని టిడిపి, వైసిపి అధినేతలు మాత్రం పెద్దనోట్ల రద్దును ఆహ్వానించడం విశేషం.

## 'బ్లాక్'పై విమర్శలకు చెక్!

2014 ఎన్నికల్లో మోడీ ప్రధాన ప్రచారాస్త్రం విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని 60రోజుల్లో దేశానికి తెప్పిస్తానని! ప్రధాని అయ్యాక ఆయన ఆ దిశగా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తమ వద్ద వేలకోట్లు దాచుకున్న భారతీయ నల్లకుబేరుల ఖాతాల వివరాలు వెల్లడించడానికి స్విస్‌బ్యాంకులు నిరాకరించాయి. దీంతో రెండు నెలల్లో నల్లధనాన్ని తెప్పిస్తామన్న మోడీ రెండేళ్లయినా రెండు రూపాయల నల్లధనాన్ని తెప్పించలేకపోయాడనే విపక్షాల విమర్శలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన స్విస్‌బ్యాంకు వాళ్లను అడుక్కునే పనికూడా లేకుండానే ఏకంగా పెద్ద కరెన్సీనే రద్దు చేశారు. ఇప్పుడు నల్లఖాతాల వివరాల కోసం వాళ్లను దేబిరించాల్సిన పనిలేదు. ఈ బ్యాంకుల్లో మన నల్లధనం నిల్వవుంటే అదిపెద్ద నోట్ల రూపంలోనే వుంటుంది. వాటికి అకౌంట్ వుండదు. కాబట్టి ఆ డబ్బు నిర్వీర్యం కావాల్సిందే!

ఏదేమైనా నరేంద్రమోడీ తీసుకున్న ఈ సంచలన నిర్ణయం దేశ భవిష్యత్‌ను మలుపుతిప్పేదే! ప్రజలలో ఆర్థిక క్రమశిక్షణాయుత జీవనానికి ఇది పునాది. ఈ పరిణామం దేశానికి మంచి చేస్తే అంతకన్నా కావాల్సిందేముంది. ఈ ప్రయోగం విజయవంతం కావాలనే దేశ ప్రజలు కోరుకుంటున్నారు.




# హోదాపై హుందాగా..

**నాలుగేళ్ల రాజకీయ అనుభవం, 44ఏళ్ల వయసున్న కుర్రోడు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా కోసం పోరాడుతుంటే 40ఏళ్ల రాజకీయ అనుభవం, 64ఏళ్ల వయసు వుందనుకుంటున్న వ్యక్తి మాత్రం ఆ హోదాకు సమాధికట్టి తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పోరాడుతున్నాడు. రాష్ట్రంలో ప్రతిపక్ష వైకాపా నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేస్తున్న విమర్శ ఇది.**

నిజమే ఇది! విభజన సమయంలో భారత పార్లమెంటు సాక్షిగా ఏపికి ఇస్తామన్న ప్రత్యేకహోదాను ఇవ్వకుండా రాష్ట్రాన్ని దగాచేయడంలో కేంద్రంలోని ఎన్డీఏ పాత్ర ఎంతుంటే సొంత రాష్ట్రానికి వారి ద్వారా జరిగిన మోసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాత్ర అంతే వుంది. ప్రత్యేకప్యాకేజీ మీద మోజుతో ఆయన అసలు ప్రత్యేకహోదానే డిమాండ్ చేయలేదు, సరికదా ప్రత్యేకహోదా వల్ల రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనాలు లేవంటూ గోబెల్స్ ప్రచారం ద్వారా ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేశారు.


కాని ఆ ప్రచారాన్ని తిప్పికొట్టడంలో ప్రతిపక్షనేతగా వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధిస్తున్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదాను సాధించడం తన రాజకీయ లక్ష్యంగా మార్చుకున్నాడు. ప్రత్యేకహోదాతో రాష్ట్రానికి వచ్చే ప్రయోజనాలను, పెరిగే ఉపాధి అవకాశాలను ఆయన విపులంగా వివరిస్తున్నారు. ప్రత్యేకహోదా... దాని ఉపయోగాలపై ఆయన ముందస్తుగా బాగానే అధ్యయనం చేసారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు ప్రధాన నగరాలలో యువభేరి సదస్సుల ద్వారా ప్రత్యేకహోదా ప్రయోజనాలను జగన్ యువత మనసుల్లోకి బాగా ఎక్కించగలిగారు. ముఖ్యంగా ప్రత్యేకహోదా వస్తే పరిశ్రమలు వచ్చి ఉపాధి అవకాశాలు పెరుగుతాయనే అంశం యువతను ఆకర్షిస్తోంది.

ప్రత్యేకహోదా సాధన కోసం జగన్ ఆందోళనలు, బంద్‌లు, నిరసనలు వంటి రొటీన్ మార్గాలను ఎంచుకోలేదు. ఇటువంటివి రోజూ చేస్తే ప్రజలే వీటిని వ్యతిరేకించే అవకాశముంది. అందుకే జగన్ వ్యూహాత్మకంగా ప్రజలకు ప్రత్యేకహోదాపై అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా విశాఖపట్నంలో నిర్వహించిన 'జై ఆంధ్రప్రదేశ్' సదస్సులో ప్రత్యేకహోదాపై జగన్ చేసిన ప్రసంగం రాజకీయ విశ్లేషకులే కాక విమర్శకుల ప్రశంసలు సైతం అందుకుంది. ఓ సీనియర్ పాత్రికేయుడు జగన్ చేసిన ప్రసంగంపై చేసిన విశ్లేషణలో ఒక అంశాన్ని అధ్యయనం చేసి దానిని వివరించడంలో జగన్, పెద్దలు జైపాల్‌రెడ్డి, ఉండవల్లి అరుణ్‌కుమార్ లాంటి వారిని తలపించారని పేర్కొన్నారు. ప్రత్యేకహోదాపై జగన్ అధ్యయనం చేసి తెలుసుకున్న అంశాలను ఆ సదస్సులో ప్రజల ముందుంచిన తీరు ఎంతో ఆశ్చర్యం కలిగించింది. గత 15ఏళ్లుగా ప్రత్యేకహోదా పొందిన వివిధ రాష్ట్రాలు సాధించిన అభివృద్ధిని గణాంకాలతో సహా ఆయన వివరించడం అందరి ప్రశంసలందుకుంది. కేంద్రం ఏపికి ఇచ్చిన నిధుల వివరాలను కూడా ఆయన గణాంకాలతో వివరించారు. జగన్ తన ప్రసంగంలో మేధావులు, రచయితలు, కవులు, గ్రంథకర్తలు తమ రచనలలో వాడిన సూక్తులను ప్రస్తావిస్తూ, తన రాజకీయ ప్రసంగానికి, రాష్ట్ర ప్రయోజనాలను అనుసంధానించి, మధ్యమధ్యలో ఈ కొటేషన్లను వాడిన తీరు తలపండిన సీనియర్ రాజకీయ నాయకులనే తలపించింది.

చంద్రబాబు గంట మాట్లాడితే అందులో ముప్పావుగంట సొల్లువాగుడు, సొంతడబ్బా ఉంటుంది. పది, పదిహేను నిముషాలు మాత్రమే పనికొచ్చే సబ్జెక్ట్ వుంటుంది. కాని విశాఖ సదస్సులో జగన్ మాట్లాడిన ప్రతి మాట కూడా రాష్ట్ర ప్రయోజనాల చుట్టూనే తిరగడం విశేషం. ముఖ్యంగా ప్రత్యేకహోదా ప్రయోజనాలు, పారిశ్రామిక ప్రగతి, వచ్చే ఉద్యోగాలు, పన్ను రాయితీలు వంటి వాటిని అరటి పండు వలచి చేతిలో పెట్టినంత సులభంగా జగన్ విశదీకరించిన తీరు విమర్శకుల చేత కూడా జేజేలు పలికించింది.

ప్రత్యేకహోదాపై ప్రజల్లో చలనం లేదంటే వాళ్లు మోడీ ఇచ్చిన, చంద్రబాబు తీసుకుంటానని అనుకుంటున్న ప్రత్యేక ప్యాకేజీని ఆమోదించినట్లు కాదు. ప్రజల మౌనం తుఫాన్ ముందటి ప్రశాంతత లాంటిది. జగన్ ప్రత్యేకహోదా అంశాన్ని ఇదే చైతన్యంతో ముందుకు తీసుకెళితే ఎన్నికల నాటికి ప్రశాంతత బద్దలై ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్ల తుఫాన్ రావడం ఖాయం.

# ట్రంప్ హిట్... హిల్లరీ ఔట్!



మొన్నటిదాకా ఆయనంటే చాలామందికి అలుసే. ఆయనకు రాజకీయాలు తెలియవని, రాజకీయాలంటే రియల్‌ఎస్టేట్ వ్యాపారమో లేదా రియాలిటీషోలో కావని ఎద్దేవా చేశారు. ఆయన్ను విదూషకుడని, అమర్యాదస్తుడని, అసలాయన గెలవనే గెలవడని రకరకాల విమర్శలు చేశారు. ప్రత్యర్థులతో పాటు తమపార్టీలోనివారు కూడా ఆయనపై ఎన్నో ఆరోపణలు చేశారు. అయితే, ఎవరెన్నన్నా.. ఎవరెన్ననుకున్నా ఆయన తలవంచలేదు. అన్నిటికీ ఆయన ఎదురొడ్డి పోరాడారు. అందరి వూహలనూ చిత్తు చేసి..అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘనవిజయం సాధించి విజయకేతనం ఎగరవేశారు. త్వరలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన శ్వేతసౌధంలోకి అడుగుపెట్టబోతున్నారు. సంచలనాలకే సంచలనంగా నిలిచి.. ఎవరి అంచనాలకు అందకుండానే అమెరికా ప్రజల మనసులను గెలిచి.. అగ్రరాజ్యానికి అధిపతిగా.. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అమెరికా అధ్యక్షపీఠాన్ని అధిరోహించబోతున్నారు. ప్రత్యర్థుల ఆశల్ని అడియాసలు చేసి.. సర్వేలన్నిటినీ తికమకచేసి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా అత్యధిక మెజార్టీతో విజయదుందుభి మోగించి..యావత్ ప్రపంచమే నివ్వెరపోయేలా చేసి రియల్ హీరో అన్పించుకున్నారు. ఆయన పేరే ట్రంప్..డొనాల్డ్ ట్రంప్!...

డొనాల్డ్ ట్రంప్!... ఆయనో సంచలనం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఆయన విజయం ఇంకా సంచలనం. ట్రంప్ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో అమెరికా రాజకీయ చరిత్రలో మరో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. తాజాగా జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో విజయానికి మొత్తం 538 ఎలక్టోరల్ ఓట్లకు గాను అధ్యక్ష అభ్యర్థి విజయం సాధించాలంటే 270 ఓట్లు అవసరం. రిపబ్లికన్ అభ్యర్థిగా రంగంలోకి దిగిన ట్రంప్ ఆ మ్యాజిక్‌ఫిగర్‌ను ఒక్కసారిగా అధిగమించి ఎవరూ ఊహించనివిధంగా డెమోక్రాట్ల కోటలను సైతం బద్దలుకొట్టారు. అత్యధికంగా 289 ఓట్లతో తిరుగులేని విజయాన్ని సాధించి ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అమెరికా అధ్యక్ష పీఠాన్ని కైవశం చేసుకున్నారు. అగ్రరాజ్యమైన అమెరికా 45వ అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. చివరి క్షణం వరకు హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో అందరూ గెలుస్తారనుకున్న డెమోక్రాటిక్ అభ్యర్థి హిల్లరీ 218 ఓట్లకే పరిమితమయ్యారు. అనేక సర్వేల్లో హిల్లరీకే విజయం తప్పదని భావించినా హిల్లరీ ఘోరపరాజయం పొందడం, చివరికి ట్రంప్‌దే ఘనవిజయం కావడం అందరి అంచనాలనూ తలకిందులు చేసినట్లయింది. ఉద్యోగ భద్రత, ఉగ్రవాద ముప్పు నుంచి దేశానికి విముక్తి, వలసలకు అడ్డుకట్ట వేస్తా, అమెరికాను గ్రేట్ అమెరికాగా తీర్చిదిద్దుతా..వంటి ట్రంప్ హామీలు అమెరికా ప్రజల మనసులను గెలుచుకున్నాయి. అమెరికాలోని కీలకమైన రాష్ట్రాలన్నీ ట్రంప్ వైపే మొగ్గు చూపాయి. సెనేట్, ప్రతినిధుల సభలోనూ రిపబ్లికన్లకే పూర్తి మెజారిటీ సిద్ధించింది.ట్రంప్‌కు వ్యతిరేకంగా ఎంత ప్రచారం జరిగినా, ఎంతోమంది ఆందోళన వ్యక్తం చేసినా ట్రంప్‌కే ఘనవిజయం లభించింది. దీంతో హిల్లరీ అభిమానులు విచారంలో మునిగిపోగా, ట్రంప్ అభిమానులు సంబరాల్లో తేలియాడుతున్నారు. జనవరి 8వతేదిన డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలోకి అడుగుపెట్టబోతున్నారు. అమెరికా 45వ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.



## కేంద్రమంత్రి వెంకయ్యరాక

### 13న చిరమనలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

ఏ.ఎస్.పేట మండలంలోని చిరమన గ్రామానికి ఈ నెల 13వ తేదీన కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు వస్తున్నారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన గ్లోబెల్ హాస్పిటల్, రెయిన్‌బో చిన్నపిల్లల హాస్పిటల్స్ అధినేతలు, సోదరులు డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్ చౌదరి, డాక్టర్ కంచర్ల రమేష్‌చౌదరిల స్వగ్రామమిది. గత ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా వున్న ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో ఈ కంచర్ల సోదరుల ఆర్థిక చేయూతతో ఏర్పరచిన స్థలంలో 50లక్షల ప్రభుత్వ నిధులతో ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనాన్ని, 33లక్షల వ్యయంతో జిల్లా పరిషత్ హైస్కూల్ భవన సముదాయాన్ని నిర్మించారు. 13వ తేదీ ఉదయం 11గంటలకు కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ఈ భవనాలను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రమంత్రులు కామినేని శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావు, పి.నారాయణలతో పాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు హాజరు కానున్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY**, Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com